



పత్యాపురం పెద్ద తండాకు కంప వేసుకుని, స్వీయనిర్బంధం చేసుకున్న గిరిజనులు

త్రాసులో.. తిరకాసు..!

- తూకాల్లో మోసం
- రైతులను దోపిడీ చేస్తున్న వ్యాపారులు
- చోద్యంచూస్తున్న అధికారులు



ఇటీవల రైతులు పట్టుకున్న వ్యత్యాసం ఉన్న రాళ్లు



కొంతమంది అవసరాలను ఆసరాగా చేసుకుంటున్న వ్యాపారులు మార్కెట్‌లో వివిధ రకాల మోసాలకు తెరతీస్తున్నారు. తూకాల్లో తేడాలు ఉన్నా వినియోగదారులవైపు, రైతుల పక్షాన నిలబడాల్సిన అధికారులు పట్టించుకోవట్లేదు. తూతూమంత్రంగా దాడులు చేస్తున్నారు తప్ప.. మోసగాళ్లకు చెక్ పెట్టలేదన్న ఆరోపణలు వినబడుతున్నాయి. జిల్లాలో తూనికలు, కొలతల అధికారులు ఉన్నారా అని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఇటీవల రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసిన వ్యాపారి తూకం రాళ్లలో తేడాలున్నాయి. ఈ మోసాన్ని రైతులు గుర్తించి, వ్యాపారిని అధికారులకు పట్టించారు. ఏళ్లతరబడి వ్యాపారి.. రైతులను మోసం చేస్తున్నా అధికారులు గుర్తించలేకపోయారు. దీనిని బట్టి సంబంధిత శాఖాధికారులు ఏస్థాయిలో పనిచేస్తున్నారో అర్థం చేసుకోవచ్చు.

- ఆంధ్రజ్యోతి, హిందూపురం

తారుమారు తక్కెడ మాయ

రైతులు పండించిన పంటను కొంతమంది దళారులు ఇళ్ల వద్దకే వెళ్లి రూ.10 అధిక ధర ఆశచూపి సరుకును కొనుగోలు చేస్తారు. పల్లెల్లో కొంతమంది వ్యాపారులపై నమ్మకంతో సరుకును విక్రయిస్తారు. దీనిని కొందరు వ్యాపారులు ఆసరాగా మలచుకుంటున్నారు. తూకాలకు వాడే రాళ్లలో సీసంపోసి, 10 కిలోల రాయికి ఒకట్రెండు కిలోలు అధికంగా పెట్టిస్తారు. హిందూపురంలో తూకం రాళ్లు అమ్మే ప్రైవేటు వ్యక్తి వ్యత్యాసం ఉండే వాటిని వ్యాపారులకు విక్రయిస్తుంటాడు. కొన్ని 50కేజీల రాళ్లకుగాను 5కిలోలు అధికంగా వచ్చేలా వ్యత్యాసం ఉండే రాళ్లు వాడుతున్నారు. తద్వారా రైతుల నుంచి క్వింటాల్‌కు 10కిలోలు అధికంగా కొట్టేస్తూ మోసాలు చేస్తుంటారు. మరికొంతమంది వ్యాపారులు ఏళ్లతరబడి సీలు వేయించరు. వారే స్వయంగా సీసం కరిగించి రాళ్లమధ్యలో ఉన్న రంధ్రంలో నింపి ఎవరికీ అనుమానం రాకుండా తూకాలు వేస్తుంటారు.

మోసగాళ్లను పట్టిస్తున్న రైతులు

హిందూపురం మండలం చౌళూరు పంచాయతీలోని ఓ గ్రామంలో మొక్కజొన్నలను కర్ణాటకకు చెందిన వ్యాపారి కొనుగోలు చేశాడు. ఆ వ్యాపారి తూకాల్లో మోసం చేస్తున్నట్లు రైతులు గుర్తించారు. ఓ వ్యక్తి రెండు క్వింటాళ్ల జొన్నలు వ్యాపారికి విక్రయించాడు. అంతకు మునుపే రెండు క్వింటాళ్ల జొన్నలను తూకం వేసి ఉంచారు. కర్ణాటకకు చెందిన వ్యాపారి తూకం వేసినపుడు రెండు క్వింటాళ్ల జొన్నకుగాను 10కిలోలు వ్యత్యాసం వచ్చింది. దీంతో తూకాల్లో తేడా ఉందని తెలుసుకుని మరోచోట నుంచి తూకం రాళ్లను తెప్పించి తూకం వేయగా.. పది కిలోల వ్యత్యాసం కనబడింది. దీంతో సదరు వ్యాపారిపై పోలీసులకు ఫిర్యాదు చేయడానికి ప్రయత్నించారు. వ్యాపారి చేసిన తప్పును ఒప్పుకుని, క్షమాపణ కోరడంతో వదిలేశారు. నాలుగు రోజుల క్రితం పరిగి మండలంలో ఓ వ్యాపారి మొక్కజొన్న కొనుగోలు చేశాడు. 60కిలోలకుగాను 6కిలోలు వ్యత్యాసం వచ్చేలా డిజిటల్ స్కేల్‌ను రూపొందించుకున్నాడు. రైతు అనుమానం వచ్చి మళ్లీ తూకం వేయగా వ్యాపారి మోసం తేలిపోయింది. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో తూనికలు, కొలతల శాఖాధికారులు వెళ్లి కేసు నమోదు చేశారు. ఇవి వెలుగులోకి వచ్చినవి మాత్రమే. రాకున్నవి చాలా ఉన్నాయి.

చోద్యంచూస్తున్న అధికారులు

రైతుల నుంచి పంట ఉత్పత్తులు కొనుగోలు చేసే వ్యాపారులపై నిఘా ఉంచాల్సిన అధికారులు చోద్యం చూస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొంతమంది వ్యాపారులతో సంబంధిత శాఖాధికారులు పరిచయాలు పెట్టుకోవడం వల్ల రైతులను మోసం చేస్తున్నారని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతులు పండించిన పంట సీజన్‌లో నిఘా ఉంచాల్సిన సంబంధిత శాఖ పత్తాలేకుండా పోవడంతో ఇలాంటి మోసాలు పెరుగుతున్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. హిందూపురం పట్టణంలో తోపుడుబండ్లపై పండ్లు, ఇతర తినుబండారాలు విక్రయించేవారు తూనికల్లో మోసాలు చేస్తున్నారు. వారిపై కూడా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. నామమాత్రపు తనిఖీలతో సరిపెడుతున్నారన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. చాలా దుకాణాల్లో కొలతలు, తూకాల్లో మోసాలకు పాల్పడుతున్నారు.

ఎలక్ర్టానిక్ యంత్రాలేవీ?

తూకాల్లో కాలంచెల్లిన స్కేలు ఇప్పటికీ వాడటం ఏంటని రైతులు, వినియోగదారులు ప్రశ్నిస్తున్నారు. ఎలక్ర్టానిక్ తూకాల యంత్రాలు అందుబాటులోకి వచ్చినప్పటికీ అనేకమంది వ్యాపారాలు పాతకాలం తాసులే వాడుతున్నారు. కొందరైతే బండరాళ్లను వినియోగిస్తున్నారు. నిబంధనల ప్రకారం సీలువేసిన ఎలక్ర్టానిక్ యంత్రాలే వాడాలి. అవి చాలా తక్కువగా కనిపిస్తున్నాయి. హిందూపురం పట్టణంలో బియ్యం వ్యాపారులు విక్రయించే 25, 50కిలోల బస్తాలపై రెండు కిలోల వ్యత్యాసం ఉంటున్నాయని వినియోగదారులు పలుసార్లు ఫిర్యాదులు చేశారు. అయినా వాటిపై దాడులు చేసిన దాఖలాలు కనిపించలేదు.

రైతులకు అవగాహన కల్పిస్తున్నాం

రైతుల వద్దకు వెళ్లి తూకాల్లో జరుగుతున్న మోసాలపై అవగాహన కల్పిస్తున్నాం. వ్యాపారులు సరుకును కొనుగోలు చేయడానికి వచ్చినపుడు మాకు సమాచారం ఇవ్వాలని రైతులకు పదేపదే చెబుతున్నాం. అయినా కొంతమంది వ్యాపారులను నమ్మి మోసపోతున్నారు. అలాంటి వ్యాపారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. జరిమానా కూడా విధిస్తాం.

- శివశంకర్, తూనికలు, కొలతల శాఖాధికారి, హిందూపురం



వ్యత్యాసం ఉన్న రాళ్లను పరిశీలిస్తున్న తూనికలు, కొలతల శాఖాధికారులు (ఫైల్)

తండాలోనే ఉంటాం.. తండాలోనే చస్తాం..!

- దారి సమస్యకు పరిష్కారం చూపకపోవడంపై అసహనం
- గిరిజనుల స్వీయనిర్బంధం
- ముళ్లకంప వేసుకుని నిరసన

తండా ఏర్పాటు చేసుకుని..
యాభై ఏళ్లయింది..
వంద కుటుంబాలుంటున్నాయి..
నేటికీ దారి లేదు..
పొలాల వెంట.. గట్ల వెంట..
వెళ్లాల్సిందే..
ఎవరైనా అడ్డుకుంటే..
మరో దారి వెతుక్కోవాల్సిందే..
తిడితే పడాల్సిందే..
అన్నీ భరిస్తూ వచ్చారు..
ఆఖరుకు దారికి అడ్డంగా తవ్వేశారు..
ఇక.. గిరిజనులు
విసిగిపోయారు..
తమ సమస్య పట్టని..
ఈ సమాజం వద్దనుకున్నారు..
తండాలోనే ఉంటాం..
ఇక్కడే చస్తాం.. అంటూ..
కంచె వేసుకున్నారు..
స్వీయ నిర్బంధం చేసుకున్నారు..
ఆధునిక సమాజంలో
అడవి బిడ్డల ఆక్రందన ఇది..
అరణ్య రోదన ఇది..

బత్తలపల్లి, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): తండాను స్వీయనిర్బంధం చేసుకున్నారు గిరిజనులు. తాము.. ఈ జనంతో కలవలేమనీ, తమ తండాలోకి ఎవరూ రావద్దంటూ మండలంలోని పత్యాపురం ఎగువ తండావాసులు శుక్రవారం ముళ్లకంప వేసుకుని, నిరసన తెలిపారు. తండాను స్వీయనిర్బంధం చేసుకున్నారు. పత్యాపురం గ్రామ ఎగువ తండా 50 ఏళ్ల క్రితం ఏర్పడింది. పత్యాపురం నుంచి తండాకు దారి ఉంది. ఆ దారిలో పొలం ఉన్న వ్యక్తి అడ్డుచెప్పాడు. తన పొలంలో నుంచి తండాకు ప్లాన్‌లో రస్తా లేదని అడ్డగించాడు. ఎక్స్‌కవేటర్‌తో ఏడాది క్రితం అడ్డంగా గుంత తవ్వించాడు. అప్పట్నుంచి తండాలోకి వెళ్లేందుకు దారిలేక గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా పట్టించుకోలేదని వారు వాపోతున్నారు. దీంతో వారు చేసేదిలేక ఆరు నెలల క్రితం పొలం యజమాని వద్దకెళ్లి దారి వదలాలని అడిగారు. అందుకు పొలం యజమాని రూ.6లక్షలు అడిగాడు. అందుకు ఒప్పుకున్న తండావాసులు రూ.2 లక్షలు అడ్వాన్సుగా చెల్లించారు. తండాలో చందాలు వసూలు చేసి, మిగిలిన మొత్తం ఇస్తామనీ, అందుకు సమయం ఇవ్వాలని అడిగారు. అందుకు పొలం యజమాని అంగీకరించాడు. యజమాని ఇప్పుడు మాట మార్చాడు. రూ.11 లక్షలు ఇస్తేనే దారి వదులుతాననీ, అడ్వాన్సుగా ఇచ్చిన రూ.2 లక్షలు ఇన్ని రోజులు తిరిగినందుకు సరిపోతుందని చెప్పడంతో గిరిజనులు షాక్ తిన్నారు. శుక్రవారం తమ తండాలోకి ఎవరూ రావద్దంటూ ముళ్ల కంప అడ్డంగా వేసుకుని, స్వీయ నిర్బంధం చేసుకున్నారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ సోమశేఖర్.. సిబ్బందితో తండాకు వెళ్లి గిరిజనులతో మాట్లాడారు. తండాకు కంప వేసుకుని, నిర్బంధించుకోవడం సరికాదనీ, సమస్య ఉంటే అధికారుల వద్దకెళ్లి పరిష్కరించుకోవాలని సూచించారు. అధికారులు, ప్రజాప్రతినిధుల వద్దకు అనేకమార్లు తిరిగామనీ, అయినా సమస్య పరిష్కరించలేదని వాపోయారు. ఇక్కడే ఉండి.. ఇలాగే చచ్చిపోతామనీ, తమను వదిలేయండని గిరిజనులు తెగేసి చెప్పారు.



దారికి అడ్డంగా తవ్విన గుంతను పరిశీలిస్తున్న ఎస్‌ఐ

రోడ్డు ప్రమాదాలను నివారించాలి

- కలెక్టర్ టీఎస్ చేతన్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

పుట్టపర్తి టౌన్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ టీఎస్ చేతన్ పేర్కొన్నారు. స్థానిక కలెక్టరేట్‌లో శుక్రవారం జిల్లాస్థాయి రోడ్డు భద్రత కమిటీతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాల్లో మరణాల సంఖ్య తగ్గించడానికి పోలీసులు, ఆర్‌అండ్‌బీ, వైద్యశాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపేవారిపై కేసులు నమోదు చేసి, జైలు శిక్ష పడేలా చర్యలు చేపట్టాలన్నారు. తరచూ ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి, వాటి నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పాఠశాల బస్సులకు వెనుకభాగాన సీసీ కెమెరాలు అమర్చేలా చర్యలు చేపట్టాలని డీఈఓ కిష్టప్పను ఆదేశించారు. ప్రతి ద్విచక్రవాహనదారుడు హెల్మెట్ ధరించేలా చూడాలన్నారు. వీటిపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని పోలీసు శాఖను ఆదేశించారు. కదిరి-మదనపల్లి జాతీయ రహదారిలో ప్రమాదాల నివారణకు రబ్బరు వేగ నియంత్రికలు, ప్రమాద సూచికలు ఏర్పాటు చేయాలని రవాణాశాఖను ఆదేశించారు. రహదారుల కూడళ్లు, ధాబాలు, రెస్టారెంట్లలో సీసీ కెమెరాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రోడ్డు భద్రత కోసం మూడునెలలకోసారి ర్యాలీలు, అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ శ్రీనివాసరావు, జిల్లా రవాణా శాఖాధికారి కరణాసాగర్‌రెడ్డి, కదిరి వెహికల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, జాతీయ రహదారుల అధికారి భరత్, జిల్లా వైద్యాధికారి మంజువాణి, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ సంజీవయ్య, ఆర్టీసీ ఆర్‌ఎం మధుసూదన్ పాల్గొన్నారు.

ఎస్సీ కులగణనపై సోషల్ ఆడిట్: కలెక్టర్

పుట్టపర్తి టౌన్, డిసెంబరు27(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎస్సీ కులగణనపై జనవరి 10వ తేదీ వరకు సోషల్ ఆడిట్ నిర్వహించనున్నట్లు కలెక్టర్ టీఎస్ చేతన్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఎస్సీ జనాభా, పేరు, ఆధార్ నంబరు, పుట్టిన తేదీ, వయసు, ఉపకులం, మరుగుదొడ్లు, తాగునీరు, విద్యార్హత, వృత్తి, తదితర వివరాలపై సోషల్ ఆడిట్ ఉంటుందన్నారు. తద్వారా సేకరించిన సమాచారాన్ని ఈనెల 31వ తేదీలోపు వార్డు, సచివాలయాల్లో ప్రదర్శిస్తామన్నారు. అభ్యంతరాలను స్వీకరిస్తామన్నారు. జనవరి 10న కులగణన పూర్తి వివరాలు పొందుపరుస్తామన్నారు డేటాపై అభ్యంతరాలను సంబంధిత వీఆర్వోలకు అందజేయాలన్నారు. వాటిని వీఆర్వోలు పరిశీలించి, ఉన్నతాధికారులకు నివేదిస్తారని కలెక్టర్ వివరించారు.

వినతిపత్రం సమర్పణతో సరి..

- వైసీపీ పోరుబాటకు జన స్పందన అంతంతే..



పుట్టపర్తిలో ర్యాలీ చేస్తున్న వైసీపీ శ్రేణులు

పుట్టపర్తి, డిసెంబరు27(ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీల పెంపును వ్యతిరేకిస్తూ వైసీపీ చేపట్టి పోరుబాట నిరసన ధర్నా జిల్లాలో చప్పగా సాగింది. జిల్లావ్యాప్తంగా ఆయా నియోజకవర్గ కేంద్రాల్లో విద్యుత్ చార్జీల పెంపుదలపై విద్యుత్ శాఖ కార్యాలయాలవద్ద శుక్రవారం వైసీపీ శ్రేణులు నిరసన చేపట్టారు. ధర్మవరంలో మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంటకరామిరెడ్డి ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయం నుంచి ధర్నా చేశారు. పుట్టపర్తిలో వైసీపీ కార్యాలయం నుంచి పక్కనే ఉన్న విద్యుత్ ఎస్‌ఈ కార్యాలయం వరకు మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్, పుట్టపర్తి మాజీ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి ర్యాలీగా వెళ్లి వినతిపత్రం అందించారు. పెనుకొండలో వైసీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ, హిందూపురంలో సమన్వయకర్త దీపిక, కదిరిలో మక్బుల్‌బాషా, మడకశిరలో సమన్వయకర్త ఈరలక్కప్ప, మాజీ ఎమ్మెల్యే వైటీ ప్రభాకర్‌రెడ్డి, నర్సేగౌడ్ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ చేశారు. ధర్నాకు వచ్చామా.. వినతిప్రతం సమర్పించామా.. అన్న తీరుగా పోరుబాట సాగింది. వైసీపీ అధికారంలో ఉన్నపుడు ఏ కార్యక్రమం చేపట్టినా ప్రతి నియోజకవర్గంలో పెద్ద సంఖ్యలో జనంతోపాటు పార్టీ శ్రేణులు హాజరయ్యేవారు. శుక్రవారం నిర్వహించిన పోరుబాటకు మాజీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, జడ్పీటీసీలు, మున్సిపల్ ఛైర్మెన్, కౌన్సిలర్లు సర్పంచ్‌లు, కొద్దిమంది కార్యకర్తలు పాల్గొన్నారు. ప్రజలు ఎక్కడా స్వచ్ఛందంగా వచ్చిన దాఖలాలు కనిపించలేదు. రోడ్డుమార్గంలో బెంగళూరుకు వెళ్తున్న మాజీ సీఎం జగన్‌కు స్వాగతం పలికేందుకు పెనుకొండ నియోజక వర్గం సోమందేపల్లిలో వైసీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ, మాజీ మంత్రి శంకరనారాయణ వర్గీయులు వెళ్లారు. అక్కడ పోటాపోటీ నినాదాలు చేయడంతో కాసేపు ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది.







ఉమ్మడి జిల్లాలో కూటమి అద్భుత విజయం 6



పాపం.. పది విద్యార్థులు
అర్ధాకలితోనే ప్రత్యేక తరగతులకు హాజరు 7





అతి విశ్వాసం, అధికార గర్వంతో విర్రవీగిన వైసీపీకి జిల్లా ప్రజలు షాక్ ఇచ్చారు. ఈ ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికలు ఆపార్టీకి పీడకలలను మిగిల్చాయి. దౌర్జన్యాలు, అరాచకాలతో పాలన సాగించిన ఫ్యాన్ పార్టీ రెక్కలు ఓటరు తీర్పుతో విరిగిపోయాయి. కూటమిగా జట్టు కట్టి బరిలో నిలిచిన టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల దెబ్బకు వైసీపీ అడ్రస్ లేకుండా పోయింది. ఐకమత్యంగా సాగిన ఆపార్టీలు ఉమ్మడి జిల్లాలో రెండు పార్లమెంటు స్థానాలతో పాటు 14 అసెంబ్లీ స్థానాలను గెలుచుకున్నాయి. ఎన్నికల విజయం తర్వాత ఉమ్మడి జిల్లా నుంచి ముగ్గురికి అమాత్య పదవులు సైతం దక్కాయి. ఉమ్మడి జిల్లాలో అంతంతమాత్రంగానే బలం ఉన్నా టీడీపీతో జట్టు కట్టడం వల్ల జనసేన, బీజేపీలు బాగా లాభపడ్డాయి. నామినేటెడ్ పదవుల్లో సైతం ఆపార్టీలకు మంచి ప్రాధాన్యం దక్కింది.





కూటమి ఐక్యతారాగం

ధర్మవరం ఎన్నికల ప్రచార సభలో (ఫైల్)

క్లీన్‌స్వీప్

ఉమ్మడి జిల్లాలో టీడీపీ కూటమి అద్భుత విజయం

- మొత్తం ఎంపీ, ఎమ్మెల్యే స్థానాలు కైవసం
- అనంత రాజకీయ చరిత్రలో తిరుగులేని ఘనత
- అధికార గర్వంతో చతికిలపడ్డ వైసీపీ
- నామినేటెడ్‌లోనూ కూటమి నేతలకు పదవులు
- నేతల రాతను మార్చిన 2024

అనంతపురం/ పుట్టపర్తి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఒకే ఏడాదిలో రెండు ప్రభుత్వాలను చూపించిన ఘనత 2024కి దక్కుతుంది. ఈ ఏడాది జిల్లా ప్రజలు టీడీపీ కూటమికి తిరుగులేని విజయాన్ని అందించారు. జిల్లాలోని 8 నియోజక వర్గాల్లో న రా కూట మిలో భాగస్వామి అయిన టీడీపీ అభ్యర్థులకే జిల్లా ప్రజానీకం పట్టం కట్టారు. పార్లమెంటు స్థానం కూడా టీడీపీకే చిక్కింది. సెంటిమెంట్‌ను తిరగరాస్తూ ఉరవకొండ నుంచి ఎమ్మెల్యేగా పయ్యావుల కేశవ్ గెలిచి చంద్రబాబు కేబినెట్‌లో కీలకమైన ఆర్థికశాఖను దక్కించుకోవడం ఈఏడాది రాజకీయంగా ఎ ం లో విశేషం.



కేశవ్‌కు కలిసొచ్చిన కాలం

ఎదురులేని టీడీపీ

ఈ ఏడాది ఆరంభం నుంచే ఎన్నికల హడావుడి ప్రారంభమైంది. అప్పటి వరకూ స్తబ్దుగా ఉన్న తెలుగుదేశం పార్టీని బలోపేతం చేసేందుకు, ఆ పార్టీ నేతలను మేల్కొల్పేందుకు టీడీపీ జాతీయ ప్రధానకార్యదర్శి నారా లోకేశ్ చేపట్టిన పాదయాత్ర ఎంతగానో ఉపయోగపడింది. ఆ పార్టీ నుంచి ఎమ్మెల్యేగా, ఎంపీలుగా పోటీ చేసేందుకు ఆశావహుల సంఖ్య పెరగడమే ఇందుకు ఉదాహరణ. ఈ నేపథ్యంలోనే టిక్కెట్ ఆశించిన పలువురు నారా లోకేశ్ పాదయాత్రలో ఎవరికి వారు తమ బలాలను చూపించుకునేందుకు పోటీపడ్డారు. పాదయాత్ర జిల్లా సరిహద్దు దాటినప్పటికీ ఆయనకు మరింత దగ్గరకావాలనే యోచనలోనే ఆ పార్టీ నేతలు అప్పుడప్పుడు ఇతర జిల్లాలకు వెళ్లొచ్చారు. మరోవైపు చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ ఎవరికి వారు ఆందోళనలు చేశారు. అయితే అభ్యర్థుల ప్రకటనతో కొందరికి మోదం, మరికొందరికి ఖేదం మిగిలింది. జిల్లాలోని 8 అసెంబ్లీ నియోజకవర్గాల్లో మూడింటిలో కొత్తవారికి టిక్కెట్లు కేటాయించారు. అందులో అనంతపురం అర్బన్ నుంచి దగ్గుబాటి వెంకటేశ్వరప్రసాద్, కళ్యాణదుర్గం నుంచి అమిలినేని సురేంద్రబాబు, గుంతకల్లు నుంచి అనూహ్యంగా వైసీపీ ప్రభుత్వంలో మంత్రిగా పనిచేసిన గుమ్మనూరు జయరాంను టీడీపీ అభ్యర్థిగా బరిలోకి దింపారు. మిగిలిన ఐదు నియోజకవర్గాల నుంచి పాతవారినే పోటీలో ఉంచారు. రాప్తాడు నుంచి పరిటాల సునీత, ఉరవకొండ నుంచి పయ్యావుల కేశవ్, రాయదుర్గం నుంచి కాలవ శ్రీనివాసులు, తాడిపత్రి నుంచి జేసీ అశ్మిత్‌రెడ్డి, శింగనమల నుంచి బండారు శ్రావణిశ్రీ పోటీచేశారు. కూటమి పార్టీల సహకారంతో మొత్తం అన్ని స్థానాల్లో టీడీపీ అభ్యర్థులు తిరుగులేని విజయాన్ని సొంతం చేసుకున్నారు. జిల్లా చరిత్రలో అన్ని నియోజకవర్గాల్లోనూ స్వీప్ చేసిన పార్టీగా టీడీపీ నిలిచింది.

కలిసొచ్చిన పొత్తు

సార్వత్రిక ఎన్నికల ముందువరకూ తెలుగుదేశం పార్టీ ఒంటరిగానే వైసీపీ పాలనపై పోరుబాట సాగించింది. అదే తరహాలో జనసేన శ్రేణులు విడిగానే వైసీపీ పాలనపై పోరాటాలు చేశాయి. బీజేపీ సైతం అడపాదడపా వైసీపీ పాలనను ఎండగడుతూ వచ్చింది. చంద్రబాబు అరెస్టుతో జనసేనాని పవన్‌కళ్యాణ్ బహిరంగంగా టీడీపీతో పొత్తును ప్రకటించారు. ఆ తరువాత కొన్ని రోజులకు బీజేపీతోనూ పొత్తు ఏర్పడింది. ఎన్డీఏ కూటమిగా మూడు పార్టీలు కలిసి సార్వత్రిక ఎన్నికల బరిలో నిలిచి, గెలిచాయి. ఎన్నికల పొత్తు బీజేపీ, జనసేనలకు బాగా కలిసొచ్చింది. కూటమి ప్రభుత్వం ఏర్పడటంతో అటు బీజేపీ, ఇటు జనసేన నాయకులకు అధికారంలోనూ భాగస్వామ్యం లభించింది. మరీ ముఖ్యంగా అధికార యంత్రాంగంలోనూ గుర్తింపు పెరిగింది.



శ్రీసత్యసాయి జిల్లాలో..

శ్రీసత్యసాయి జిల్లాలో హిందూపురం పార్లమెంట్‌తో పాటు ఆరు అసెంబ్లీ స్థానాల్లో టీడీపీ కూటమి అభ్యర్థులు ఘన విజయం సాధించారు. హిందూపురం, పెనుకొండ, రాప్తాడు అసెంబ్లీ స్థానాల్లో టీడీపీ భారీ ఆధిక్యం సాధించగా పుట్టపర్తి, కదిరిలో మంచి మెజార్టీ సాధించింది. కాగా మడకశిరలో మాత్రం ఎంఎస్ రాజు 425 ఓట్ల స్వల్ప మెజార్టీతో గెలిచారు. టీడీపీ, జనసేనతో జత కట్టిన కమలం ధర్మవరంలో వికసించింది. జిల్లాలో పార్లమెంట్‌తోపాటు ఐదుచోట్ల టీడీపీ కూటమి ఒకచోట బీజేపీ గెలుపుతో వైసీపీ అడ్రస్ గల్లంతయ్యింది. జిల్లాలో తొలిసారి బరిలోకి దిగినా అందరూ గెలిచి శాసనసభలో అడుగుపెట్టారు. తొలిసారి గెలిచినా ఇద్దరికి మంత్రి పదవులు సైతం దక్కాయి. అధికారం శాశ్వతమని భ్రమించి, అరాచక పాలన సాగించిన వైసీపీకి జిల్లాలో కోలుకోలేని దెబ్బతగిలింది.



ఎన్నికల ప్రచార సభలో బీకే, సవిత, నిమ్మల

కూటమి దెబ్బకు..

2019 సార్వత్రిక ఎన్నికల్లో హిందూపురం అసెంబ్లీ మినహా అన్ని స్థానాల్లోనూ వైసీపీ గెలిచింది. అంతకు మునుపు 2014 ఎన్నికల్లో కదిరిలో వైసీపీ గెలిచింది. ఐదేళ్ల వైసీపీ ఎమ్మెల్యేల అరాచక పాలనకు విసిగిపోయిన ప్రజలు వారిని ఇంటికి సాగనంపారు. ఎన్నికల్లో ధర్మవరం, రాప్తాడు, పుట్టపర్తితోపాటు కళ్యాణదుర్గం సిట్టింగ్ ఎమ్మెల్యేలను మళ్లీ బరిలోకి దింపి హిందూపురం అసెంబ్లీ, పార్లమెంట్, మడకశిర, కదిరి అసెంబ్లీ స్థానాలకు కొత్త ముఖాలను బరిలో దింపారు. హిందూపురం పార్లమెంట్ స్థానం నుంచి వైసీపీ అభ్యర్థిగా బళ్లారి మాజీ ఎంపీ(బీజేపీ) శాంతను పోటీకి దింపారు. పెనుకొండ ఎమ్మెల్యే శంకరనారాయణకు స్థాన చలనం కలిగించి, అనంతపురం ఎంపీగా పోటీ చేయించారు. కళ్యాణదుర్గం ఎమ్మెల్యే, మంత్రిగా ఉన్న ఉష శ్రీచరణ్‌ను పెనుకొండ నుంచి బరిలో నిలిపారు. ఎవరిని ఎక్కడకు మార్చినా, దిగుమతి చేసుకున్నా వైసీపీ ఆశలు ఫలించలేదు. పోటీ చేసిన ప్రతి చోటా ఓటమే పలకరించింది. ప్రస్తుతం జిల్లాలో వైసీపీ మాజీ ఎమ్మెల్యేల్లో కొందరు అప్పుడప్పుడు కన్పిస్తున్నా, ఓటమితో పార్టీ కేడర్ మొత్తం డీలా పడి ముఖం చాటేస్తోంది.



ఎన్నికలలో జగన్ ప్రచారం

చతికిలపడ్డ వైసీపీ

అంతవరకు అధికారం అండగా రంకెలేసిన వైసీపీ ఎన్నికల్లో చావుదెబ్బతింది. ఎన్ని వ్యూహాలు రచించినా, సామదానదండోపాయాలు ఉపయోగించినా ప్రజలు ఆ పార్టీ అభ్యర్థులను తిరస్కరించారు. పోటీ చేసిన అన్ని స్థానాల్లోనూ వైసీపీ అభ్యర్థులు ఘోరంగా ఓడిపోయారు. జగన్ కేబినెట్‌లో పని చేసిన కళ్యాణదుర్గం ఎమ్మెల్యే ఉష శ్రీచరణ్‌ను శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండకు పంపినా ఫలితం లేకపోయింది. అలాగే కళ్యాణదుర్గం నుంచి పోటీ చేసిన అప్పటి ఎంపీ తలారీ రంగయ్య కూడా ఘోరంగా ఓడిపోయారు. అనంతపురం అర్బన్ నుంచి అనంత వెంకటరామిరెడ్డి, ఉరవకొండ నుంచి విశ్వేశ్వరరెడ్డి, గుంతకల్లు నుంచి వై. వెంకటరామిరెడ్డి, తాడిపత్రి నుంచి కేతిరెడ్డి పెద్దారెడ్డి, రాప్తాడు నుంచి తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డిలకు ఓటర్లు నిర్మొహమాటంగా తిరస్కరించారు. వీరు ఎమ్మెల్యేలుగా కొనసాగినప్పుడు ఆయా నియోజకవర్గాల్లో సాగించిన అరాచకాలు, దౌర్జన్యాల ఫలితమే ఓటమి అనేది ఆ పార్టీ వర్గాల అభిప్రాయం. ఇక రాయదుర్గం ఎమ్మెల్యేగా, ప్రభుత్వ విప్‌గా కొనసాగిన కాపు రామచంద్రారెడ్డికి టికెట్ దక్కలేదు. ఆ నియోజకవర్గం నుంచి మాజీ ఎమ్మెల్యే, అప్పటి ఏపీఐఐసీ చైర్మన్‌గా ఉన్న మెట్టు గోవిందురెడ్డిని ఎమ్మెల్యే అభ్యర్థిగా దింపినప్పటికీ ఓటమి తప్పలేదు.

ధర్మవరంలో కమల వికాసం



సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ జనసేన, బీజేపీ కూటమిగా జతకట్టడంతో అందరి అంచనాలను తలకిందుల చేస్తూ ధర్మవరం అసెంబ్లీ స్థానం నుంచి బీజేపీ అభ్యర్థి గా పోటీ చేసిన సత్యకుమార్‌యాదవ్ ఎమ్మెల్యేగా గెలిచారు. అనంతరం బీజేపీ కోటాలో మంత్రి పదవి కూడా దక్కించుకున్నారు. ధర్మవరంలో అంతంతమాత్రంగానే ఉన్న బీజేపీ కూటమిలో భాగస్వామిగా మారడంతో అద్భుత విజయం సాధించింది. వైసీపీ గట్టి పోటీ ఇచ్చినా కూటమి అభ్యర్థి సత్యకుమార్‌యాదవ్ 3734 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. ఇక్కడ టీడీపీ, జనసేన ఓటు బ్యాంకు బీజేపీకి బాగా బదిలీ కావడంతో ధర్మవరంలో కమలం వికసించింది.

ఐకమత్యంగా విజయం

వైసీపీ ప్రభుత్వాన్ని గద్దెదించేందుకు టీడీపీ, జనసేన, బీజేపీ జట్టుగా ఏర్పడటం విజయానికి బాగా కలిసొచ్చింది. జిల్లాలో జనసేన పార్టీ నిర్మాణం లేకపోయినా, ఉనికి అంతమాత్రం ఉన్న బీజేపీలు టీడీపీతో జతకట్టడం బాగా లాభించింది. ఎన్నికల్లో విజయం తర్వాత నామినేటెడ్ పదవుల్లో మొదటి, రెండో విడతల్లో సైతం జనసేన, బీజేపీ శ్రేణులకు ప్రాధాన్యం కల్పించారు. ఇటీవల జరిగిన సాగునీటి ఎన్నికల్లో జనసేన, బీజేపీ శ్రేణులకు అధ్యక్ష, ఉపాధ్యక్ష, సభ్యుల్లో ప్రాధాన్యం దక్కింది. ఇదే ఉత్సాహంతో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏకపక్ష ఫలితాలు సాధించేలా కూటమి పార్టీ శ్రేణులు ముందుకు సాగుతున్నాయి.

నామినేటెడ్‌లో కూటమి నేతలకు పదవులు



సార్వత్రిక ఎన్నికల్లో కూటమి అద్భుత విజయం సాధించి, అధికారాన్ని చేపట్టడంతో కూటమిలో భాగస్వాములైన టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీ నాయకులకు నామినేటెడ్ పదవులు దక్కాయి. జిల్లాలో టీడీపీ ముఖ్య నేతలు, మాజీ ప్రజాప్రతినిధులకు రాష్ట్రస్థాయి చైర్మన్ పదవులు దక్కాయి. జడ్పీ మాజీ చైర్మన్ పూలనాగరాజుకు ఆర్టీసీ రీజినల్ చైర్మన్ పదవి దక్కగా, మాజీ ఎమ్మెల్సీ దీపకర్‌రెడ్డికి సీడాప్ చైర్మన్ పదవి లభించింది. ఇక జనసేన నుంచి ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు టీసీ వరుణ్‌కు అహుడా చైర్మన్ పదవి లభించింది. బీజేపీ నాయకుల్లో కొందరికి డైరెక్టర్ పోస్టులు దక్కాయి. మొత్తంగా రాజకీయంగా ఈ ఏడాది కూటమి పార్టీలు, ఆయా పార్టీల నేతలకు ఆనందాన్ని అందించగా, వైసీపీ నేతలకు నిరాశ, నిస్పృహను మిగిల్చింది.

అసెంబ్లీలోకి కొత్తముఖాలు



జిల్లాలో తొలిసారిగా నలుగురు కొత్త వారు ఎమ్మెల్యేలుగా గెలిచారు. పుట్టపర్తి నుంచి పల్లె సింధూరరెడ్డి, పెనుకొండ నుంచి సవిత, ధర్మవరం నుంచి సత్యకుమార్‌యాదవ్, మడకశిర నుంచి ఎంఎస్‌రాజులు తొలిసారి ఎమ్మెల్యేలుగా గెలిచి అసెంబ్లీలో అడుగుపెట్టారు. మడకశిర ఎస్సీ రిజర్వుడ్ నియోజక వర్గం టీడీపీ కూటమి అభ్యర్థిగా ప్రకటించిన సునీల్‌కుమార్ బదులుగా శింగనమలకు చెందిన రాష్ట్ర టీడీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఎంఎస్ రాజును తెరపైకి తెచ్చారు. అభ్యర్థిగా ప్రకటించిన తర్వాత కేవలం 23 రోజుల్లోనే ఎంఎస్‌రాజు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఆపై టీటీడీ పాలక మండలి సభ్యుడిగా నియమితులయ్యారు. పొత్తులో బీజేపీ కోటా కింద ధర్మవరం నుంచి సత్యకుమార్‌యాదవ్ రంగంలోకి దిగి తొలిసారిగా ఎన్నికై మంత్రి పదవి చేపట్టారు. పెనుకొండ నుంచి సవిత బరిలో దిగి జిల్లాలో భారీ మెజార్టీతో గెలవడంతో పాటు మంత్రి పదవిని పొందారు. కాగా జిల్లా నుంచి మంత్రి పదవులు చేపట్టిన ఇద్దరూ బీసీ వర్గాలకు చెందిన వారే కావడం గమనార్హం.

ఉపాధి చూపిన మన్మోహన్


స్మరించుకున్న బండ్లపల్లి గ్రామస్థులు... మాజీ ప్రధాని మృతితో గ్రామంలో విషాదఛాయలు



ఉపాధి పనుల్లో నిమగ్నమైన కూలీలు..



దేశంలోనే మొట్టమొదటి జాబ్‌కార్డు



ఉపాధి హామీ పథకంతో మండలంలోని బండ్లపల్లి గ్రామం పేరు దేశనలు మూలల వినిపించింది. ప్రధాని హోదాలో దివంగత మన్మోహన్‌సింగ్ ఇక్కడికి వచ్చి పథకాన్ని ప్రారంభించారు. అప్పటి ఆయన పర్యటనను గ్రామస్థులు తీపి జ్ఞాపకంగా మనసులో నేటికీ ఉంచుకున్నారు. అయితే గురువారం రాత్రి ఆయన మరణవార్త విని బండ్లపల్లి గ్రామస్థులు విషాదంలో మునిగిపోయారు. పేద ప్రజలు వలస పోకుండా ఉన్న ఊరిలోనే వంద రోజులు పనులు చేసుకునేలా ఉపాధి హామీ పథకాన్ని తెచ్చిన మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ ఆపద్బాంధవుడని వారు కొనియాడుతున్నారు. ఆయన మృతి ఎంతో విచారకరమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. - ఆంధ్రజ్యోతి, నార్పల

నా ఇద్దరు పిల్లలను బతికించుకున్నా



నాభర్త చీమల రాముడు అనారోగ్యంతో 22ఏళ్ల కిందట చనిపోయాడు. అప్పటికి నాకు ఇద్దరు చిన్నపిల్లలు ఉన్నారు. పనులు లేక, ఇద్దరు పిల్లలను ఎలా పోషించాలో తెలియక దిక్కుతోచని స్థితిలో ఉన్నా. ఆత్మహత్య అనుకుంటున్న తరుణంలో మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ దేవుడిలా ఉపాధి హామీ పథకాన్ని ప్రారంభించారు. అప్పటి నుంచి ఉపాధి పనులకు వెళ్లి, వచ్చిన ఆదాయంతో నా ఇద్దరు పిల్లలను పోషించుకున్నా. రెండున్నర ఎకరాల భూమిలో ఉపాధి పథకం ద్వారానే మామిడి చెట్లను సాగు చేశా. అలాంటి ఉపాధి పథకాన్ని తెచ్చిన మన్మోహన్‌సింగ్ లాంటి దేవుడు చనిపోవడం బాధాకరం.

- చీమల పెద్దక్క తొలి జాబ్‌కార్డు పొందిన మహిళ

షేక్ హ్యాండ్ ఇచ్చారు



చేయడానికి పనులు లేని కాలంలో ప్రధాని హోదాలో మన్మోహన్‌సింగ్ మా ఊరికి వచ్చారు. ఉపాధి హామీ పథకాన్ని ప్రారంభించారు. అప్పుడు నాకు షేక్ హ్యాండ్ ఇచ్చి, నా భుజం తట్టి మీరు ఎవరి దగ్గర పనులు చేయవద్దని ఉపాధి పనులు చేసుకోమని హిందీలో చెప్పారు. నాకు అర్థం కాకపోవడంతో అప్పటి కలెక్టర్ అనురాధ మేడం దాన్ని తెలుగులో చెప్పారు. ఉపాధి పనులు చేయడం ద్వారా వచ్చిన డబ్బులతోనే నా కూతురిని నర్సింగ్ కోర్సు చదివించా. ఆమెకు ఆర్డీటీలో ఉద్యోగం వచ్చిందన్నారు.

- బండారు బాలనరసింహులు

బెంగళూరులో డ్రైవర్‌గా పనిచేశా



కుటుంబాన్ని పోషించడం కోసం భార్య, పిల్లను వదిలి ఎనిమిదేళ్లగా బళ్లారి, బెంగళూరులో డ్రైవర్‌గా పనిచేశా. ఒడిదుడుకుల మధ్య నిద్రలేని రాత్రులు గడిపా. ఎప్పుడైతే ఉపాధి హామీ పథకం వచ్చిందో అప్పటి నుంచి మా గ్రామానికి తిరిగి వచ్చా. ఉపాధి పనులకు వెళుతూ ఒక కుమార్తెకు పెళ్లి చేశా. మరో ఇద్దరు పిల్లలను టీటీసీ చదివిస్తున్నా. అద్భుతమైన ఉపాధి పథకాన్ని మాలాంటి పేదలకు అందించిన మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతి ఎంతో బాధకలిగిస్తోంది.

-రామకృష్ణ, బండ్లపల్లి

బెంగళూరులో పాచిపనులకు వెళ్లా



ఉపాధి హామీ పథకం ప్రవేశ పెట్టకముందు ఊర్లో పనులు లేకపోవడంతో పూటగడవడం కోసం నేను, నా భర్త కలిసి బెంగళూరుకు వలస వెళ్లాం. అక్కడ నేనే పాచిపనులు చేసేదాన్ని. ఆరేళ్లు అక్కడే ఉన్నాం. ఉపాధి పథకం ద్వారా పనులు కల్పించారని తెలిసి సొంతూరికి వచ్చేశాం. అప్పటి నుంచి ఇక్కడే ఉంటూ నా భర్త ఎర్రప్పతో కలిసి ఉపాధి పనులు చేసుకుంటూ బతుకుతున్నాం.

-కుళ్లాయమ్మ, బండ్లపల్లి

తిరుపతి ప్యాసింజర్ రైలు రద్దు



గుంతకల్లు,డిసెంబరు27(ఆంధ్రజ్యోతి): ప్రయాగ్ రాజ్ కుంభమేళాను పురస్కరించుకుని కదిరిదేవరపల్లి-తిరుపతి ప్యాసింజర్‌ను రద్దు చేసినట్లు రైల్వే అధికారులు శుక్రవారం తెలిపారు. కుంభమేళాకు భక్తుల తరలింపు కోసం కొన్ని రైళ్లను అక్కడికి నడపనున్నట్లు పేర్కొన్నారు. ఈ కారణంగా ఈనెల 29నుంచి మార్చి1 వరకు తిరుపతి ప్యాసింజర్‌ను రద్దు చేసినట్లు తెలియజేశారు. దీంతో ఇదివరకే రిజర్వేషన్ చేసుకున్న ప్రయాణికుల టికెట్‌లను రద్దు పరిచినట్లు తెలియజేశారు.

'రబీ పంటల్లో సస్యరక్షణ చర్యలు తీసుకోండి'

అనంతపురం అర్బన్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): రబీలో సాగు చేసిన పలు రకాల పంటల్లో తగిన సస్యరక్షణ చర్యలు చేపట్టాలని రేకులకుంట వ్యవసాయ పరిశోధనా స్థానం, మెట్ట వ్యవసాయం ప్రధాన శాస్త్రవేత్త విజయ్ శంకర్‌బాబు, సేద్యవిభాగం సీనియర్ శాస్త్రవేత్త నారాయణస్వామి, రీసర్చ్ అసోసియేట్ ఉమాదేవి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రబీలో సాగు చేసిన వేరుశనగ పంట ప్రస్తుతం మొలక దశ నుంచి పూత దశలో ఉందన్నారు. శాకీయ దశలోని పంటలో 15- 20 రోజులకు అంతర కృషి చేసి కలుపు నివారణ చర్యలు చేపట్టాలన్నారు. పంటలో సూక్ష్మపోషకాలైన జింక్, ఇనుప ధాతు లోపం గమనించినట్లు తెలిపారు. జింక్ లోప నివారణ కోసం జింక్ సల్ఫేట్ 2 గ్రాములు, ఇనుప ధాతు లోపం నివారణ కోసం అన్నబేధి 5 గ్రాములు, సిట్రిక్ ఆమ్లం 1 గ్రాము లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. ప్రస్తుతం వరి నాట్లు వేసుకుంటున్న రైతులు సిఫార్సు చేసిన ఎరువుల్లో ఒకటో వంతు నత్రజని, మొత్తం భాస్వరం, పొటాష్ ఎరువులు చివరి దమ్ములో వేయాలని సూచించారు. నాట్లు వేసిన తర్వాత ప్రతి 2 మీటర్లకు 20 సెం.మీ కాలి బాటలు వేసుకోవడం ద్వారా ఎరువులు పిచికారీ చేసుకునేందుకు సులభంగా ఉంటుందన్నారు. ఈ సీజన్‌లో జింక్ లోపం నివారణ కోసం జింక్ సల్ఫేట్‌ను ఎకరాకు 20 కిలోలు ఆఖరి దమ్ములో వేయాలన్నారు. పంట ఎదుగుదల దశలో జింక్ లోపం గమనిస్తే జింక్ సల్ఫేట్ 0.2 గ్రాములు (2 గ్రాములు, లీటరు నీటికి) పిచికారీ చేయాలన్నారు. సమస్య తీవ్రత ఆధారంగా ఐదు రోజుల వ్యవధిలో మళ్లీ పిచికారి చేసుకోవాలని తెలిపారు. ప్రస్తుతం మామిడి తోటల్లో తేనె మంచు పురుగు, పక్షికన్ను తెగులు, బూడిత తెగులు నివారణ కోసం 0.3 మి.లీ ఇమిడా క్లోప్రిడ్, 2.0 మి.లీ క్లోరోథలోనిల్‌ను లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలని సూచించారు. పచ్చి పూత దశలోని తోటల్లో 0.3 గ్రాములు థయోమిథాక్సామ్ లేదా 1.5 మి.లీ బుప్రోఫెజిన్, 2.0 హెక్సాకొనజోల్ లేదా 2 గ్రాములు మాంకోజెబ్‌ను లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలని పేర్కొన్నారు. అలాగే పశువుల్లో బ్రూసెల్లోసిస్ బ్యాక్టీరియా వ్యాధి, గొర్రెలు, మేకల్లో పీపీఆర్ వైరస్ ఆశించేందుకు అవకాశం ఉందన్నారు. వ్యాక్సిన్‌లు వేయించుకోవాలని సూచించారు.

క్రైం కార్నర్

రూ.5 కోట్లకు ఐపీ..!

- అధిక వడ్డీ ఎరవేసి అప్పులు
- ఎస్పీ కార్యాలయం వద్ద బాధితుల ఆందోళన


ఆందోళన చేస్తున్న బాధితులు

అనంతపురం క్రైం, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): ఆరు నెలల్లో రెట్టింపు డబ్బులు ఇస్తామని చెప్పడంతో అత్యాశకు పోయారు. పైసా, పైసా పోగేసి కూడబెట్టుకున్న సొమ్మును వారి చేతిలో పెట్టారు. మొదట్లో 'రిటర్న్స్' బాగా ఉండటంతో చాలా మంది డబ్బులు ఇచ్చారు. ఇలా ఇచ్చిన మొత్తం రూ.5 కోట్లు దాటింది. సొమ్ము వసూలు చేసిన ఇద్దరు సోదరులు ఐపీ పెట్టారు. దీంతో బాధితులు శుక్రవారం లబోదిబో మంటూ ఎస్పీ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. తమకు న్యాయం చేయాలని విన్నవించారు. కళ్యాణదుర్గం మండలంలోని బాలవెంకటాపురం గ్రామానికి చెందిన ఖాసీంవలి, ఇమామం వలి సోదరులు అదే ఊరిలో కిరాణం దుకాణాన్ని నిర్వహించేవారు. అధిక వడ్డీ ఇస్తామని ఊరిలోని పలువురితో డబ్బులు వసూలు చేశారు. కొన్ని నెలలు బాగానే చెల్లించారు. దీంతో మిగిలినవారికి నమ్మకం కుదిరింది. దాదాపు 150 మంది రూ.5 కోట్ల వరకు వడ్డీకి ఇచ్చారు. వీరందరికీ సోదరులు ఇద్దరూ ఐపీ నోటీసులు పంపించారు. ఉన్నది పల్లెటూరిలోనే అయినా, బాలవెంకటాపురంలో ఖాసీం, ఇమామ్ సోదరులు విలాసవంతమైన ఇళ్లు, ఖరీదైన ఫర్నిచర్ ఏర్పాటు చేసుకున్నారని బాధితులు తెలిపారు. తాము ఇచ్చిన సొమ్ముతో 70 తులాల బంగారం, అనంతపురంలో ప్లాట్లు కొన్నారని అన్నారు. డ్వాక్రా మహిళల పొదుపు సొమ్ము, రుణాలు, ఉపాధి పనుల్లో సంపాదించిన కూలి డబ్బులు, అమ్మ ఒడి సొమ్ము, బంగారాన్ని తాకట్టుపెట్టి తీసుకున్న సొమ్మును ఖాసీ సోదరులకు ఇచ్చి నిండా మునిగిపోయామని పలువురు కంటతడి పెట్టారు. నాలుగేళ్ల నుంచి డబ్బులు తీసుకోవడం ప్రారంభించారని, మొదట్లో అధిక వడ్డీ, ఆ తరువాత సాధారణ వడ్డీ ఇచ్చారని, చివరకు ఐపీ నోటీసులు ఇచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏడాది క్రితమే కళ్యాణదుర్గం పోలీసులకు ఫిర్యాదు చేశామని, దీంతో వారు ఊరు విడిచి అనంతపురం చేరారని తెలిపారు.

ఉపాధి కోసం వెళ్లిన వ్యక్తి మృతి


సంధ్యేనాయక్ (ఫైల్)

నల్లచెరువు, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): ఉపాధి కోసం తెలంగాణ రాష్ట్రం హైదారాబాద్‌కు వెళ్లిన మండలంలోని బాలేపల్లి తండా నివాసి మూడే సంధ్యేనాయక్ (60) ప్రమాదవశాత్తు మరణించాడు. సంధ్యేనాయక్‌కు కుమారుడు, కుమార్తె ఉన్నారు. వీరికి వివాహాలు అయిపోయాయి. ఏడాది క్రితం సంధ్యేనాయక్ తన భార్య శాంతమ్మతో కలిసి ఉపాధి కోసం హైదారాబాద్ వెళ్లారు. అక్కడ శుక్రవారం బాత్ రూంలో స్నానం చేస్తుండగా.. జారి పడ్డాడు. తలకు తీవ్ర గాయం కావడంతో ఆయన అక్కడికక్కడే మరణించాడు. మృతదేహానికి స్వగ్రామానికి తీసుకువస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

శవమై తేలిన అదృశ్యమైన మహిళ

- హత్య చేసినట్లు ఒప్పుకున్న భర్త


సురేఖ(ఫైల్)

గుంతకల్లుటౌన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): అదృశ్యమైన మహిళ మండలంలోని పాతకొత్తచెరువు గ్రామ సమీపంలోని చెరువులో శుక్రవారం శవమై తెలింది. టూటౌన్ పోలీసులు, మృతురాలి బంధువులు తెలిపిన మేరకు.. కర్నూలు జిల్లా ఆగ్రహారానికి చెందిన ఆర్ఎంపీ రఘురాముడు మండలంలోని దోసులుడికి గ్రామంలో ఓ ఇంటిని అద్దెకు తీసుకుని నివాసముంటున్నాడు. అతడి భార్య సురేఖ(29) పట్టణంలోని క్రెడిట్ యాక్సిస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో ఫీల్డ్ వర్కర్‌గా పనిచేస్తున్నారు. ఈనెల మూడోతేదీ మధ్యాహ్నం పాత గుత్తిరోడ్డులోని మణికంఠ గ్యాస్ వద్ద తన భర్త రఘురాముడుకు డ్యూటీ పనిమీద దౌల్తాపురం వెళ్తున్నానని చెప్పి వెళ్లింది. సాయంత్రమైన ఇంటికి రాకపోవడంతో, రఘురాముడు పలు చోట్ల గాలించి, చివరికి నాలుగో తేదీన టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. అయితే రఘురాముడే తన భార్యను హత్య చేసి ఉంటాడని మృతురాలి బంధువులు అనుమానం వ్యక్తం చేశారు. దీంతో మూడు రోజుల కిందట రఘురాముడును పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. తానే ఆమెను హత్యచేసి సంచిలో ఉంచి పాతకొత్తచెరువు గ్రామ చెరువులో పడేసినట్లు చెప్పాడు. పోలీసులు శుక్రవారం మధ్యాహ్నం అక్కడికి వెళ్లి మృతదేహాన్ని బయటకు తీసి, పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వం ఆసుపత్రికి తరలించారు. మృతురాలికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ట్రూ అప్ పాపం జగన్‌దే: కాలవ


మీడియాతో మాట్లాడుతున్న కాలవ శ్రీనివాసులు

అనంతపురం డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): ట్రూఅప్ చార్జీల భారం మాజీ సీఎం జగన్‌రెడ్డిదేనని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు మండిపడ్డారు. చేసిన పాపాన్ని కప్పిపుచ్చుకునేందుకు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారని ఆరోపించారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరితో కలిసి శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో ఆరు నెలలుగా ప్రజా రంజక పాలన సాగిస్తున్న కూటమి ప్రభుత్వానికి ప్రజల నుంచి వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేకనే వైసీపీ రాజకీయ కుట్రలకు తెరతీస్తోందని విమర్శించారు. వైసీపీ పాలనలో రైతులను విస్మరించారని, వారిపై కపట ప్రేమను చూపుతూ ఇటీవల ధర్నా చేశారని అన్నారు. తాజాగా కరెంటు చార్జీల పెంపు పేరుతో నిరసన చేపట్టడం ఆ పార్టీకి ఆత్మహత్యా సదృశ్యమేనని అన్నారు. విద్యుత్ చార్జీల పెంపెతో సీఎం చంద్రబాబు పరిపాలనకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. వైసీపీ పాలకులు చేసిన పాపాలే దీనికి కారణమని అన్నారు. అవసరం లేకపోయినా, అధిక ధరలకు విద్యుత్‌ను కొనుగోలు చే శారని అన్నారు. చౌకగా వస్తున్న విద్యుత్‌ను కాదని, బహిరంగ మార్కెట్‌లో అధిక ధరలకు కరెంటు కొనుగోలు చేసినందుకే విద్యుత్ రంగం అస్తవ్యస్తంగా మారిందని అన్నారు. సీఎం చంద్రబాబు, కూటమి ప్రభుత్వంపై అనుమానాలు, అపోహలు సృష్టిస్తున్నారని విమర్శించారు. తప్పుడు వివరాలతో ప్రజలను మోసం చేసేందుకు ధర్నాలు నిర్వహించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. అంతకు ముందు మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతికి మౌనం పాటించి, సంతాపం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ ప్రచార కార్యదర్శి కూచి హరి, టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి గంజే నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సిరుల వాన..!

- ఫలించిన దానిమ్మ రైతుల కష్టం
- నాలుగు రోజుల్లోనే రూ.60 వేలు పెరిగిన ధర
- ప్రస్తుతం టన్ను ధర రూ.1.20 లక్షలకుపైనే..
- ఆనందం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు


విరగ్గాసిన దానిమ్మ



దానిమ్మ పంటకు మంచిరోజులు వచ్చాయి. గతనెలలో ఉన్న ధర డిసెంబరు ప్రథమార్థం పూర్తయ్యేసరికి అమాంతం పెరిగింది. నాలుగురోజుల్లోనే టన్నుపై ఏకంగా రూ.60వేలు పెరిగింది. దీంతో రైతుల ఆనందానికి హద్దు లేకుండాపోయింది. ఆశించిన స్థాయిలో దిగుబడులు రావడం, కాయలు సైతం నాణ్యతగా ఉండటం రైతులకు బాగా కలిసి వస్తోంది. పుట్లూరు, యల్లనూరు మండలాల్లో సుమారు 2100 ఎకరాల విస్తీర్ణంలో రైతులు దానిమ్మ పంటను సాగు చేశారు. పుట్లూరు మండలంలోని పుట్లూరు, పి. చింతలపల్లి, బాలాపురం, కోమటికుంట్ల, కందికాపుల, కొండుగారికుంట, రంగమనాయునిపల్లి, మడ్డిపల్లి, యల్లనూరు మండలంలోని వేములపల్లి, దంతలపల్లి, కృష్ణాపురం, తిమ్మంపల్లి, బుక్కాపురం, చింతకాయమంద, కొడవండ్లపల్లి, పీఎం కొండాపురం, కల్లూరు, కూచివారిపల్లి, బొప్పేపల్లి తదితర గ్రామాల్లో ఎక్కువగా సాగుచేస్తున్నారు.

- యల్లనూరు/పుట్లూరు, (ఆంధ్రజ్యోతి)

రూ.లక్ష దాటిన టన్ను ధర

స్తబ్ధుగా ఉన్న దానిమ్మ ధర ఒకేసారిగా భారీగా పెరిగింది. టన్నుపై దాదాపు రూ.60వేలు పెరిగింది. ప్రస్తుతం టన్ను ధర రూ.1.20లక్షల నుంచి 1.40లక్షలు పలుకుతోంది. దానిమ్మ కాయలు నాణ్యతనుబట్టి కొన్నిగ్రామాల్లో టన్ను రూ.1.40లక్షలకు కొనుగోలు చేస్తున్నారు. రెండునెలల క్రితం టన్ను రూ.60వేల నుంచి 70వేల వరకు ధర పలికింది. ఎకరాకు పెట్టుబడి సుమారు లక్షరూపాయల నుంచి లక్షన్నరవరకు వస్తోంది. పురుగుమందుల పిచికారికి సీజన్‌బట్టి మరో రూ.50వేలు పెట్టుబడి అదనంగా వస్తుంది. దిగుబడి ఆశించిన స్థాయిలో వస్తోంది. ఎకరాకు సరాసరి కాపు బాగా వస్తే 5టన్నుల నుంచి 8 టన్నుల వరకు దిగుబడి వస్తుంది.

కంటికి రెప్పలా కాపాడుకోవాలి

దానిమ్మ పంట చాలా సున్నితమైనది. దీనికి చీడపీడలు ఎక్కువగా సోకుతాయి. కాపు వచ్చినప్పటి నుంచి మూడునెలలపాటు కన్నబిడ్డలా పంటను చూసుకోవాల్సి ఉంటుంది. మే, జూన్ మాసాల్లో ఒకసారి, జూలై, ఆగస్టులో ఒకసారి, నవంబరు, డిసెంబరులో మరోసారి కాపు వస్తుంది. వీటిలో మే, జూన్ మాసాల్లో వచ్చే కాపును మాత్రం పసిపిల్లలను చూసుకున్నట్లు చూసుకోవాల్సి ఉంటుంది. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా నష్టపోవాల్సి వస్తుంది. ప్రతి నాలుగురోజులకు ఒకసారి పురుగు మందులను పిచికారి చేయాలి. ఈ కాలంలో వర్షాలు పడితే తప్పనిసరిగా మరోసారి పిచికారి చేయాలి. లేకపోతే చెట్లకు తెగులు, ఎండుతెగులు, దానిమ్మ కాయలపై మచ్చలు వస్తాయి. దీని ప్రభావం దిగుబడిపై పడుతుంది.

ఇతర రాష్ట్రాల్లో దిగుబడి లేకపోవడంతోనే...

గతంలో దానిమ్మపంట మహారాష్ట్ర, కర్ణాటక, రాజస్తాన్ రాష్ట్రాల్లో ఎక్కువగా పండేది. ఆ దిగుబడులు తెలుగు రాష్ట్రాలకు సైతం వచ్చేవి. ఈ ఏడాది ఇతర రాష్ట్రాల్లో ఆశించినంత దిగుబడులు లేకపోవడంతో ఇక్కడ ధర పెరిగింది. కర్ణాటక, మహారాష్ట్రల్లో నెలన్నర ముందుగానే పంటకాలం ముగియడంతో దిగుబడులు లేవు. ఇది మన రైతులకు బాగా కలిసొచ్చినట్లు అయింది. పుట్లూరు, యల్లనూరు మండలాల్లో పండించిన పంటను ఎక్కువగా కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాలకు ఎగుమతి చేస్తుంటారు. ఇక్కడి దానిమ్మ కాయలు నాణ్యతగా ఉండటంతో డిమాండ్ పెరుగుతోంది. ఈధరలు ఇంకా పెరిగే అవకాశం ఉందని పలువురు రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ధర ఇలాగే కొనసాగాలి



గతంలో దానిమ్మ పంట సాగుచేసి ధరలు లేక నష్టపోయా. ఈ ఏడాది ధర ఆశాజనకంగా ఉంది. ఇంకా నెలన్నరపాటు ధర కొనసాగితే బాగుంటుంది. నాలుగు ఎకరాల్లో దానిమ్మపంట సాగుచేశా. పంట ఇంకా నెలన్నరలో చేతికి వచ్చే అవకాశం ఉంది. ఈ పంటను జాగ్రత్తగా చూసుకోవాల్సి ఉంటుంది. ఈ ధరలు ఇలాగే కొనసాగితే రైతుల అప్పులు తీరే అవకాశం ఉంది.

- శివశంకర్‌రెడ్డి, రైతు, కందికాపుల

ధర పెరగడంతో లాభాలు



ఈ ఏడాది వర్షాలు అధికంగా రావడంతో దిగుబడులు కూడా తక్కువగా ఉన్నాయి. దీనికితోడు తెగుళ్లు కూడా అధికంగా ఉన్నాయి. ఈ ఏడాది ఎండుతెగులు అధికమైంది. గత నెలరోజుల నుంచి నిలకడగా ఉన్న మార్కెట్ ఒక్కసారిగా పెరిగిపోయింది. గతేడాదితో పోలిస్తే ఈ సంవత్సరం కిలోపై రూ.20నుంచి 30రూపాయలు అధికంగా వచ్చే అవకాశం కనిపిస్తోంది.

-లేపాక్షిరెడ్డి, తిమ్మంపల్లి

గంజాయి ముఠా అరెస్టు

- 4.72 కిలోల మత్తు పదార్థం స్వాధీనం


నిందితులను తరలిస్తున్న పోలీసులు

అనంతపురం క్రైం, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): గంజాయి రవాణా చేస్తున్న ముఠాను జిల్లా పోలీసులు శుక్రవారం అరెస్టు చేసినట్లు వెల్లడించారు. వారి నుంచి 4.720 కిలోల గంజాయి, 10 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అరెస్ట్ వివరాలను జిల్లా ఎస్పీ జగదీష్ శుక్రవారం మీడియా సమావేశంలో వెల్లడించారు.

మహారాష్ట్ర నుంచి అనంతకు...

గంజాయిపై కూటమి సర్కారు ఉక్కుపాదం మోపుతుండటంతో సరఫరా దారులు రూటు మార్చారు. మహారాష్ట్రలోని సోలాపూర్, కురువాడి తదితర ప్రాంతాలనుంచి రైలుద్వారా తీసుకువచ్చి అనంతపురంలో విక్రయిస్తున్నారు. నగర శివారు ప్రాంతాలు, వ్యసనపరులైన విద్యార్థులకు సరఫరా చేస్తున్నారు. ఆరుగ్రాముల పొట్లాలుగా మార్చి ఒక్కో పొట్లం రూ.500 చొప్పున విక్రయిస్తున్నారు. మహారాష్ట్రలో కిలో గంజాయి రూ.15వేలకు కొనుగోలుచేసి అనంతపురంలో కిలో రూ.83వేలకు విక్రయిస్తున్నారు.

పట్టుబడ్డ ముఠా వివరాలు

పోలీసులకు పట్టుబడిన వారిలో అనంతపురానికి చెందిన తాడిపత్రి సయ్యద్ మహమ్మద్ నవాజ్(23), గౌస్ మొహిద్దీదన్ అలియాస్ తొత్తి(21), ఎర్రోళ్ల జస్వంత్ అలియాస్ బిట్టు(21), కడవకల్లు మురళీధర్ అలియాస్ చింటు(26), షేక్ మహమ్మద్ గౌస్ అలియాస్ పిట్టు(26), తేజస్వరూప్(19), వెంకటేష్(24) ఉన్నారు. ధర్మవరానికి చెందిన మామిళ్ల రాజేష్‌కుమార్(26), కట్టుబడి మురళీ(30), తోపాటు ఒక మైనర్ ముఠాగా ఏర్పడ్డారు. ఈ ముఠాలో తాడిపత్రి సయ్యద్ మహమ్మద్ నవాజ్ కీలకంగా వ్యవహరిస్తున్నాడు. మహారాష్ట్రలో గంజాయిని కొనుగోలుచేసి అనంతపురం తరలించడం, వ్యసనపరులకు సరఫరా చేయడంలో ముఖ్య పాత్ర పోషిస్తున్నాడు. ముఠాలోని వెంకటేష్‌పై వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఇప్పటికే గంజాయికేసు ఉంది.


వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ జగదీష్

గంజాయి, 10 సెల్ ఫోన్లు స్వాధీనం...

గంజాయి విక్రయ ముఠా సమాచారం అందుకున్న బుక్కరాయసముద్రం సీఐ కరుణాకర్, ఇన్‌చార్జ్ సీఐ హేమంత్‌కుమార్, టాక్స్‌ఫోర్స్ ఎస్సై రాజశేఖర్ రెడ్డిలు రంగంలో దిగారు. ముఠా సభ్యులను అరెస్ట్ చేసి 4.720 కిలోల గంజాయి, 10 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. మౌత్ ఫ్రెషనర్స్, ఖాళీ ఓసీలు, ఐ డ్రాప్స్‌ను సీజ్‌చేశారు. గంజాయి, మాదక ద్రవ్యాలను ఎక్కడైనా విక్రయించినా, వినియోగించినా సమాచారం చేరవేసేందుకు టోల్‌ఫ్రీ నెంబర్ 1972 లేదా స్థానిక పోలీసులకు 100/112 నెంబర్‌కు తెలియజేయాలని ఎస్పీ సూచించారు.

వార్తలోనే సమాధానముంది కదా..!

జిల్లాలో పేకాట సాగుతున్న వైనంపై శుక్రవారం 'తోటలో పేకాట' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. గంజాయి ముఠా అరెస్టను వివరిస్తున్న ఎస్పీని మీడియా ప్రతినిధులు దీనిపై ప్రశ్నించారు. ఇందుకు ఆయన స్పందిస్తూ.. వార్తలోనే సమాధానముంది కదా అని పేర్కొన్నారు.

చంద్రన్న బీమా పోర్టల్ ఓపెన్

అనంతపురం అర్బన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): చంద్రన్న బీమా పోర్టల్ శుక్రవారం ఓపెన్ అయ్యింది. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఈ ఏడాది మార్చి నుంచి రైతు పోర్టల్ బంద్ అయింది. అప్పటి నుంచి అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబానికి సంబంధించిన దరఖాస్తును ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసేందుకు అవకాశం లేకుండాపోయింది. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పాటైన ఆరుమాసాల తర్వాత చంద్రన్న బీమా పోర్టల్‌ను ఓపెన్ చేయడంతో బాధిత రైతు కుటుంబాల నిరీక్షణకు తెరపడినట్లైంది.

రైతు పోర్టల్ బంద్ అయిన నాటి నుంచి ఇప్పటి దాకా 41 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. వారి కుటుంబాలకి ప్రభుత్వం రూ.ఏడు లక్షల పరిహారం అందజేస్తోంది. సార్వత్రిక ఎన్నికల నుంచి పోర్టల్ బంద్ కావడంతో వీఆర్వో ఆన్‌లైన్‌లో రైతులు ఆత్మహత్య చేసుకున్నట్లు రిజిస్టర్ చేయలేని పరిస్థితి నెలకొంది. ఇప్పటి దాకా 41 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని, వారి వివరాలు జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయానికి ఆఫ్‌లైన్ ద్వారా పంపినట్లు సమాచారం.

రేపు ఎస్జీటీ మెగా గ్రాండ్ టెస్ట్

కొత్తచెరువు డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): ఏపీ డీఎస్సీ ఎస్జీటీ అభ్యర్థులకు ఈనెల 29న కొత్తచెరువులో మెగా గ్రాండ్ టెస్ట్ (మోడల్ పరీక్ష) నిర్వహించనున్నట్లు వదాన్య సొసైటీ ఫౌండర్ అశోక్ పడపాటి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. జిల్లావ్యాప్తంగా 2వేల మంది అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోగా.. 1800 మంది హాల్‌టిక్కెట్లను డౌన్‌లోడ్ చేసుకున్నారన్నారు. హాల్‌టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసుకోనివారు www.vadaanya.org వెబ్‌సైట్‌లో సంప్రదించాలన్నారు. ఐదు కేంద్రాల్లో పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు చేశామన్నారు.

జిల్లాలో చిరుజల్లులు

అనంతపురం అర్బన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం చిరుజల్లులు పడ్డాయి. అనంతపురం, కళ్యాణదుర్గం, నార్పల, యాడికి, బెళుగుప్ప, కూడేరు, పుట్లూరు తదితర మండలాల్లో చిరుజల్లులు పడ్డాయి. జిల్లాలోని 18 మండలాల్లో గురువారం చిరుజల్లులు పడ్డాయి. గార్లదిన్నె, యల్లనూరులో 4.2 మి.మీ వర్షపాతం నమోదైంది. బుక్కరాయసముద్రంలో 3.4, కూడేరు 3.2, గుత్తి 2.4, అనంతపురం, శింగనమల 2.2, రాప్తాడు 2.0 మి.మీ వర్షపాతం నమోదైంది.

పాపం.. పది విద్యార్థులు

- అర్ధాకలితోనే ప్రత్యేక తరగతులకు హాజరు
- మధ్యాహ్న భోజనంతోనే రోజంతా గడుపుతున్న వైనం
- అల్పాహారం, స్నాక్స్ అందించాలని విన్నపాలు

కదిరిలోని జడ్పీ బాలికోన్నత పాఠశాలలో ప్రత్యేక తరగతులకు హాజరైన విద్యార్థినులు



కదిరి అర్బన్, డిసెంబరు27(ఆంధ్రజ్యోతి): ఉత్తమ ఫలితాలే లక్ష్యంగా ప్రభుత్వ పాఠశాలల్లో టెన్త్ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. వందరోజుల ప్రణాళికలో భాగంగా ఈనెల 1వ తేదీన వీటిని ప్రారంభించారు. ఆ మేరకు విద్యార్థులు ఉదయం 8 గంటలకే పాఠశాలకు చేరుకోవాలి. సాయంత్రం 5 గంటల వరకు ఉండాలి. రోజుకు ఒక సబ్జెక్టు టీచరు తరగతులు నిర్వహిస్తున్నారు. పాఠశాలకు పక్క గ్రామాల నుంచి వచ్చే విద్యార్థులు అంత ఉదయాన్నే ఇళ్లలో అల్పాహారం సిద్ధంకాక, ఖాళీ కడుపుతో వస్తున్నారు. మధ్యాహ్న భోజనం పెట్టేవరకు ఆకలితో అలమటిస్తున్నారు. సాయంత్రం 5గంటల వరకు పాఠశాలలో ఉండి, తరువాత వారు ఇంటికి చేరేసరికి రాత్రవుతోంది. అప్పటి వరకు ఆకలితో అలమటిస్తున్నారు. ఇలా.. అర్ధాకలితో చదువుపై శ్రద్ధ పెట్టలేకపోతున్నారు. పాఠశాలలోనే ఉదయం అల్పామారం, సాయంత్రం స్నాక్స్ ఇస్తే బాగుంటుందని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

రోజంతా మధ్యాహ్న భోజనంతోనే..

ఉన్నత పాఠశాలలు ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహిస్తున్నారు. పదో తరగతి విద్యార్థులకు మాత్రం వంద రోజుల ప్రనాళికలో భాగంగా ప్రత్యేక తరగతులు ఏర్పాటు చేశారు. ఆ మేరకు ఉదయం 8 నుంచి 9 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు రోజూ రెండుగంటలపాటు ప్రత్యేక తరగతులు ఉంటాయి. ఆ మేరకు వారు ఉదయం 8గంటలకు పాఠశాలకు హాజరవుతారు. వారిలో కొంతమంది అల్పాహారం తిని బడికి వస్తున్నారు. మరికొంతమంది తినకుండానే ఖాళీ కడుపుతో బడికి చేరుతున్నారు. అల్పాహారం తినకుండా వచ్చిన విద్యార్థులు మధ్యాహ్నం వరకు ఆకలితోనే ఉండాల్సి వస్తోంది. పాఠశాలలో అందించే మధ్యాహ్న భోజనం చేసి, సాయంత్రం ఇంటికెళ్లేవరకు అలాగే అర్ధాకలితో ఉండాల్సి వస్తోంది. దీంతో చదువుపై ఏకాగ్రత పెట్టలేని పరిస్థితి నెలకొంది. ప్రభుత్వంతోపాటు దాతలు అల్పాహారం అందించేందుకు ముందుకు రావాల్సిన అవసరముంది.

దూర ప్రాంతాల వారికి ఇబ్బందులు

ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదివే విద్యార్థులకు ఉదయం 8 నుంచి 9 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఉదయం 8 గంటలకు పాఠశాలకు రావాలంటే దూరప్రాంతాలవారు గంట ముందుగానే ఇళ్లనుంచి బయలుదేరాల్సి ఉంటుంది. సాయంత్రం ఇంటికెళ్లే సరికి ఆరుగంటలవుతోంది. అప్పటివరకు ఆకలితో అలమటించాల్సి వస్తోంది. ఈకారణంగా కొంతమంది విద్యార్థులు చదువుపై దృష్టి సారించలేకపోతున్నారు. సాయంత్రం ప్రత్యేక తరగతులు ప్రారంభమయ్యే ముందు అల్పాహారం అందిస్తే ఉత్సహంగా చదువుతారు.

సెలవు రోజుల్లో సమస్య

విద్యాశాఖ వందరోజుల ప్రణాళికను ఆది, రెండో శనివారాలు ఇతర సెలవు రోజుల్లో సైతం అమలు చేస్తుండడంలో విద్యార్థులకు ఆర్టీసీ బస్సుపాసులు చెల్లడంలేదు. ఆ రోజుల్లో మధ్యాహ్నం భోజనం అందడంలేదు. చార్జీలు పెట్టుకుని వస్తూ ఇళ్ల నుంచి భోజనం తెచ్చుకోవాల్సి వస్తోంది. ప్రభుత్వమే సెలవు రోజుల్లో ఏజెన్సీల ద్వారా భోజనం పెట్టాలని వారి తల్లిదండ్రులు కోరుతున్నారు. ఇందుకోసం ప్రభుత్వమే ప్రత్యేక నిధులు విడుదల చేస్తే బాగుంటుందని ఉపాధ్యాయ సంఘాలు కోరుతున్నాయి. పలుచోట్ల ఉపాధ్యాయులే సొంత నిధులు వెచ్చించి, అల్పాహారం అందిస్తున్నారు. ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, దాతలు అల్పాహారం అందించడానికి ముందుకు రావాల్సిన అవసరం ఉంది. దీంతో విద్యార్థుల ఆకలి తీరి, చదువుపై పూర్తిస్థాయిలో దృష్టి పెట్టగలరు.

స్టడీ మెటీరియల్ ఇస్తే మేలు

పది పరీక్షల్లో ఉత్తీర్ణతే లక్ష్యంగా రూపొందించిన వంద రోజుల ప్రణాళికను దృష్టిలో పెట్టుకుని సిలబస్ పూర్తి చేయడానికి ఉపాధ్యాయులు కుస్తీ పడుతున్నారు. గతంలో జిల్లా పరిషత్ ద్వారా పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందించేవారు. ఇందులో ముఖ్యమైన ప్రశ్నపత్రాలుండేవి. సాధారణ విద్యార్థులు ఉత్తీర్ణత సాధించడానికి ఎంతగానో ఉపయోగపడేవి. ఈ ఏడాది పాఠశాలలకు మెటీరియల్ అందలేదు. వందరోజుల ప్రణాళికకు ముందే స్టడీ మెటీరియల్ అందజేస్తే బాగుంటుందని టీచర్లు, విద్యార్థులు అభిప్రాయపడుతున్నారు.

విద్యార్థులకు అల్పాహారం అందించాలి



పదిలో మంచి మార్కులు సాధించేలా విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించడం మంచిదే. వారు ఉదయం నుంచి సాయంత్రం వరకు పాఠశాలలో ఉండడంతో ఆకలితో చదువుపై శ్రద్ధ పెట్టలేకపోతున్నారు. సెలవు రోజుల్లో నిర్వహించడం కారణంగా మధ్యాహ్న భోజనం ఇంటినుంచి తెచ్చుకోవాల్సి ఉంది. దూరప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం విద్యార్థులకు అల్పహారం అందించేలా చర్యలు తీసుకోవాలి.

- బాబ్‌జాన్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు

ప్రజాప్రతినిధులు, దాతలు ముందుకు రావాలి



పదో తరగతి విద్యార్థులకు అల్పాహారం అందించడానికి ప్రజాప్రతినిధులు, దాతలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలి. ప్రభుత్వ ఉద్దేశం మంచిదైనా.. అల్పాహారం అందకపోవడంతో విద్యార్థులు చదువుపై దృష్టి సారించలేకపోతున్నారు. కొన్ని పాఠశాలల్లో టీచర్లే.. విద్యార్థులకు అల్పాహారం అందించడం అభినందనీయం.

- మహేంద్ర, ఏఐఎస్ఎఫ్, కదిరి నియోజకవర్గ కార్యదర్శి

న్యూస్ బాక్స్ ...

రేపు ఎస్టీయూ జిల్లా సమావేశం

కొత్తచెరువు, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): పుట్టపర్తి మండలం బీడిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం ఎస్టీయూ జిల్లా సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యర్శులు హరిప్రసాద్‌రెడ్డి, చంద్రశేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి పశ్చిమ రాయల సీమ నియోజకవర్గ మాజీశాసనసభ్యులు కత్తి నరసింహారెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు సాయిశ్రీనివాస్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రఘునాథరెడ్డి, రాష్ట్ర, జిల్లా కార్యవర్గ సభ్యులు హాజరవుతారన్నారు. ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిష్కార మార్గాలు విద్యారంగంలో సవాళ్లను తదితర విషయాలపై ఈ సమావేశంలో చర్చిస్తామన్నారు. సమావేశానికి ఉపాధ్యాయులు, ఎస్టీయూ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

అక్కదేవత విగ్రహాల పునఃప్రతిష్ఠ


విగ్రహాలను ఊరేగింపుగా తీసుకెళ్తున్న భక్తులు

నల్లమాడ, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని చౌట కుంటపల్లి సమీపగుట్టలో అక్కదేవత గుడిలో అక్కదేవతల విగ్రహాలను శుక్రవారం పునఃప్రతిష్ఠించారు. పూజారి విశ్వనాథరెడ్డి మాట్లాడుతూ... 15 సంవత్సరాల క్రితం అక్కదేవత గుడిని దాతల సహకారంతో నిర్మించామన్నారు. అక్కదేవతలనూ ప్రతిష్ఠించామన్నారు. ప్రస్తుతం ఆలయానికి మరిన్ని మరమ్మతులు చేయించి.. విగ్రహాలను పునఃప్రతిష్ఠించినట్లు చెప్పారు. ఈకార్యక్రమానికి నల్లమాడ, ఓడీసీ, కొత్తచెరువు మండలాలతో పాటు కర్ణాటక రాష్ట్రం నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు భక్తులకు అన్నసంతర్పణం చేశారు.

వృద్ధాశ్రమానికి వస్తువుల అందజేత

ఓబుళదేవరచెరువు, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): అమ డగూరు మండలం గాజులవారిపల్లి వద్ద ఉన్న మాతృశ్రీ వృద్ధాశ్రమానికి విశ్రాంత తహసీల్దార్ నరసింహారెడ్డి రూ.పదివేల విలువ చేసే నిత్యావసర వస్తువులు శుక్రవారం అందించారు. ఈకార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకురాలు అరుణ జ్యోతి, ఆత్మారెడ్డి, నాగభూషణ, నాగిరెడ్డి, పారేసు పాల్గొన్నారు.

నివేదికలు తయారు చేయండి

ఓబుళదేవరచెరువు, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): త్వరగా ఎస్సీ కులగణన నివేదికలను తయారు చేయాలని ఎంపీడీఓ రాబర్టు విల్సన్, పర్యవేక్షకులు రమణనాయక్ సూచించారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయలో వీఆర్‌ఓలు, డిజిటల్, వెల్ఫేర్ అసిస్టెంట్లతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ప్రతి గ్రామ సచివాలయంలో షెడ్యుల్‌కులాల ఆడిట్, (ఎస్సీ) వివరాల జాబితాను సచివాలయంలో ప్రదర్శించాలని, తప్పుఒప్పులుంటే సరిచేసుకోవడానికి ఈనెల 31వరకు దరఖాస్తులు స్వీకరించాలని అన్నారు.

బీజేపీలో చేరిన వైసీపీ నాయకులు


బీజేపీలోకి చేరిన తాడిమర్రి వైసీపీ నాయకులు

ధర్మవరం, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ సమక్షంలో తాడిమర్రి మండలానికి చెందిన వైసీపీ నాయకులు బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. విజయవాడలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం వారు బీజేపీలో చేరారు. వారిలో తాడిమర్రి మండలం చిల్లవారిపల్లికి చెందిన వైసీపీ నాయకుడు నారాయణరెడ్డి, బాలిరెడ్డి, సోమిరెడ్డి, ఓబిరెడ్డి, మంజునాథ్‌రెడ్డి, శివరాం రెడ్డి, ప్రకాశ్‌రెడ్డి, చిన్నఓబిరెడ్డి తదితరులు ఉన్నారు.

యూటీఎఫ్ బైక్ ర్యాలీ

కదిరి అర్బన్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): కాకినాడలో జనవరి 5,6,7,8 తేదీల్లో నిర్వహించే యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలను జయప్రదం చేయాని యూటీఎఫ్ నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆ నాయకులు శుక్రవారం పట్ట ణంలో బైక్ ర్యాలీని ఎమ్మార్సీ కార్యాలయం నుంచి కోనేరు వరకు నిర్వహించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయ కులు లక్ష్మీరాజా, జయచంద్రారెడ్డి, శ్రీనివాసులు, సుబ్బారెడ్డి, మల్లికార్జున, సునిల్‌కుమార్, బ్రహేంద్ర పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సు వాయిదా

తనకల్లు, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని బాలసముద్రంలో మంగళవారం జరగాల్సిన రెవెన్యూ సదస్సును వాయిదా వేసినట్లు తహసీల్దార్ శోభా సువర్ణమ్మ శుక్రవారం తెలిపారు. మంగళవారం పింఛన్ల పంపిణీ ఉందని, దానికి సచివాలయ సిబ్బంది హాజరవుతారని, దీంతో రెవెన్యూ సదస్సును వాయిదా వేసినట్లు చెప్పారు. జనవరి 8న రెవెన్యూ సదస్సును బాలసముద్రం సచివాలయంలో నిర్వహిస్తామన్నారు.

ఆలయాలకు నీటి ట్యాంకుల అందజేత


నీటి ట్యాంకులు అందజేస్తున్న సభ్యులు

ధర్మవరం, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): స్థానిక నాలుగు ఆలయాలకు తాగునీటి ట్యాంకులను అందజేసినట్లు యువర్స్ ఫౌండేషన్ సభ్యులు శుక్రవారం తెలిపారు. హంపాపురం ఆంజనేయస్వామి క్షేత్రం ఉత్తర ద్వారానికి రూ.25వేలు, వాటర్ ట్యాంకు, ధర్మవరంలోని ఇందిరమ్మకాలనీలోని అయ్యప్పస్వామి, ఆంజనేయస్వామి, కన్యకాపరమేశ్వరస్వామి ఆలయాలకు ఓవర్ హెడ్ ట్యాంకులను రామచంద్రగుప్తా, కుమార్తెలు నీరజాదేవి, షర్మిలాదేవి, హేలసాదేవి అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు శీలానాగేంద్ర, సెక్రటరీ జయరాం, కోశాధికారి బండినాగేంద్ర, ఫౌండర్ పోలా ప్రభాకర్, సభ్యులు సత్రశాల మల్లికార్జున, జయంతి పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రానికి చేయూత

ధర్మవరం, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శివానగర్ 1,2,5 అంగన్‌వాడీ కేంద్రాలకు మిత్ర హేలిస్టిక్ హెల్త్‌సొసైటీ ఛైర్మన్ లక్ష్మీరెడ్డి దాదాపు రూ. 50 వేల విలువైన వస్తువులను శుక్రవారం అందజేశారు. ఆటవస్తువులు, బుక్స్, బాటిల్స్, టీవీ, రైస్‌కుక్కర్ తదితర వాటిని అందజేశారు. ఇప్పటివరకు రాష్ట్రంలోని 60 అంగన్‌వాడీ కేంద్రాలకు ఆటవస్తువులు, వివిధ రకాల వస్తువులు అందించామన్నారు.


మా చెరువులూ నింపండి

- చింతలపల్లి, మల్కాపురం రైతుల వినతి
- పీఏబీఆర్ నీటి కోసం ఎదురుచూపు
- ఎండిన చెరువులు, కంపచెట్లతో నిండిన వైనం



ఎండిన మల్కాపురం చెరువు, చింతలపల్లి చెరువులో ఏపుగా పెరిగిన కంపచెట్లు (ఇన్‌సెట్లో)

ధర్మవరంరూరల్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): పీఏబీఆర్ కుడికాలువ ద్వారా తమ చెరువులకూ నీరివ్వాలని మండలంలోని చింతలపల్లి, మల్కాపురం రైతులు కోరుతున్నారు. చెరువుల్లో నీరంతా ఇంకిపోయి వట్టి చెరువులుగా మారాయి. చెరువుల్లో ఎక్కడా చూసినా పిచ్చిమొక్కలు విపరీతంగా పెరిగాయి. మరో రెండు నెలలకు రానున్న వేసవిలో బోరుబావుల్లో భూగర్భ జలాలు పూర్తిగా ఇంకిపోయే ప్రమాదం ఉందని ఆ గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పీఏబీఆర్ కుడికాలువ ద్వారా దిగువ ప్రాంతాలకు 20 రోజులుగా నీరు వెళ్తోంది. ఇప్పటికే తాడిమర్రి మండలంలో పలు చెరువులు నిండుతున్నాయి. రెండేళ్లుగా చెరువులకు నీరు వదలకపోవడంతో ఈ చెరువులన్నీ ఎండిపోయాయి. పీఏబీఆర్ కుడికాలువ ద్వారా వెళ్తున్న నీరు ధర్మవరం మండలంలో చింతలపల్లి, మల్కాపురం చెరువులకు మాత్రమే నీరు వెళ్తుంది. ఈ నీరు ఉప్పునేసినపల్లి సమీపంలో ఉన్న తూము ఎత్తితే చిగిచెర్ల మీదుగా చింతలపల్లి చెరువుకు నీరు చేరుతుంది. చింతలపల్లి చెరువు నిండిన తర్వాత మల్కాపురం చెరువుకు నీరు చేరుతుంది. కాలువ నుంచి చెరువులకు నీరు వదిలితే.. ఉప్పునేసినపల్లి, చిగిచెర్ల నుంచి చింతలపల్లి వరకు బోరుబావుల్లో భూగర్భ జలాలూ పెరిగి వందల ఎకరాలు సాగులోకి వస్తాయి. చింతలపల్లి చెరువు నిండితే చింతలపల్లితో పాటు వసంతపురం గ్రామాల్లో బోరుబావుల్లో నీరు సమృద్ధిగా పెరుగుతుందని, పంటల


పీఏబీఆర్ కుడికాలువలో పారుతున్న నీరు

సాగుకు అనుకూలంగా ఉంటుంది. దీంతో చింతలపల్లి చెరువు కింద ఉన్న ఆయకట్టుతో పాటు వందలాది ఎకరాలు సాగులోకి వస్తాయి. ఈ ఏడాది ఈ చెరువులకు నీరు వదలకపోతే.. మళ్లీ వచ్చే వర్షాకాలం వరకూ వేచి ఉండాల్సి వస్తుందని, అంతలోపు బోరుబావుల్లో నీటిమట్టం తగ్గుతుందని ఇరు గ్రామాల రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చింతలపల్లి, మల్కాపురం గ్రామాల్లో అధికంగా ఉద్యానవన రైతులు ఉన్నారు. ఈ రెండు గ్రామాల్లో వందలాది ఎకరాల్లో చీని, అరటి, బొప్పాయి, దోస పంటలను సాగుచేసుకున్నారు. ఈ పంటలతో పాటు వేరుశనగ, కాయగూరలు పంటలనూ పండిస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి చెరువులకు నీరు వదలాలని ఆయా గ్రామరైతులు కోరుతున్నారు.

భూగర్భ జలాలు తగ్గుతాయ్



ప్రస్తుతం పీఏబీఆర్ కుడికాలువ ద్వారా నీళ్లు వస్తున్నాయి. మా చెరువుకు నీళ్లు వదలాలి. చెరువులో నీళ్లు ఉంటే బోరుబావుల్లో భూగర్భజలాలు పెరుగుతాయి. దీంతో పంటలు సాగుచేసుకుంటాం. వర్షాకాలం అయిపోయింది. ఇక వచ్చేది ఎండకాలం. కాబట్టి చెరువులో నీరు లేకపోతే భూగర్భజలాలు తగ్గుతాయని ఆందోళనగా ఉంది. మా చెరువుకూ నీరు వదిలాలి.

\- పతకమూరి నాగరాజు, రైతు, చింతలపల్లి

పంటల సాగుకు అనుకూలం



చెరువులో నీరు ఉంటే పంటల సాగుకు అనుకూలం. రైతులను దృష్టిలో ఉంచుకుని చెరువులకు నీళ్లు వదలాలి. గత ఏడాది కూడా మా గ్రామ చెరువుకు చుక్కనీరు రాలేదు. ఈ ఏడాది నీరు రాకపోతే వేసవిలో ఎండతీవ్రతకు బోరుబావుల్లో నీళ్లు తగ్గే అవకాశం ఉంది. చెరువులో నీరు రాక తుమ్మచెట్లు విపరీతంగా పెరిగాయి. అధికారులు స్పందించాలి.

\- నారాయణరెడ్డి, రైతు, మల్కాపురం

నీరు విడుదల చేస్తాం

వచ్చేనెల సంక్రాంతి పండుగ తర్వాత చింతలపల్లి, మల్కాపురం చెరువులకూ నీరు విడుదల చేస్తాం. ప్రస్తుతం తాడిమర్రి మండలానికి నీరు వదలాం. అగ్రహారం చెరువు నిండి తాడిమర్రి చెరువుకు వెళ్లతున్నాయి. దిగువ ప్రాంత చెరువులకు నింపిన తర్వాత తప్పకుండా చెరువులకు నీరు వదులుతాం. గ్రామస్థులు, రైతులు ఎవరూ ఆందోళన చెందవద్దు.

\- రెడ్డప్ప రెడ్డి, పీఏబీఆర్ డీఈ, ధర్మవరం

అనంతం.. సాయివైభవం..

పుట్టపర్తి, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): కెనడా దేశానికి చెందిన భక్తులు చేపట్టిన అనంతం.. సాయివైభవం నాటిక భక్తులను అలరింపజేసింది. స్థానిక ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంత్ సభామండపంలో రెండోరోజు శుక్రవారం కెనడా సేవాదళ్‌యువత సత్యసాయి ప్రేమతత్వం పేరిట అనంతం.. సాయి వైభవం అంటూ నాటికను ప్రదర్శించారు. మహాభారతంలోని కొన్ని ఘట్టాలను ప్రదర్శించారు. అనంతరం సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.



నాటికలోని దృశ్యాలు

రైతులను ఆదుకోవాలి

కదిరి అర్బన్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): అతివృష్టి, అనావృష్టితో కుదేలవుతున్న రైతులను ఆదుకోవాలని యువరైతు నవీన్‌కుమార్ కోరారు. హిందూపురం నియోజకవర్గం పరిగి మండలానికి చెందిన నవీన్ కుమార్ ఎద్దుల బండిపై నవంబరు 17న యాత్ర ప్రారంభించి.. డిసెంబరు 14న ఉప ముఖ్యమంత్రి పవన్ క ల్యాణ్‌ను మంగళగిరిలో పార్టీ కార్యాలయంలో కలిశారు. రైతు సమస్యలను వివరించారు. తిరుగు ప్రయాణంలో శుక్రవారం కదిరికి చేరుకున్నారు. ఈ సందర్భంగా రైతు స్వరాజ్య వేదిక కలిగిన భానుజా, జనసేన నాయకులు కుటాల లక్ష్మణ్ తదితరులు నవీన్‌కుమార్‌కు ఘనంగా స్వాగతం పలికి.. సన్మానించారు. నవీన్‌కుమార్ మాట్లాడుతూ.. కౌలు రైతులను ఆదుకోవాలని, పండ్ల మొక్కల రైతులకు అన్ని పథకాలు వర్తింపచేయాలని, మహిళ రైతులను గుర్తించాలని, దళారీ వ్యవస్థను నిర్మూలించి. ప్రభుత్వమే రైతుల పంటను కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని పవన్‌కల్యాణ్‌ను కోరినట్లు చెప్పారు.



నవీన్‌కుమార్‌ను సన్మానిస్తున్న భానుజా



ధర్మవరం : ర్యాలీ నిర్వహిస్తున్న కేతిరెడ్డి, నాయకులు

విద్యుత్ చార్జీలు తగ్గించాలి: వైసీపీ

ధర్మవరం, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఆధ్వర్యంలో ఎస్‌బీఐ కాలనీ నుంచి కూరగాయల మార్కెట్‌లోని ట్రాన్స్‌కో కార్యాలయం వరకు భారీ ఎత్తున పోరుబాట ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైసీపీ జిల్లా అధికార ప్రతినిధి గుర్రం శీన, మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్‌లు చందమూరు నారాయణరెడ్డి, మానపల్లి సాయికుమార్, పెనుజూరు నాగరాజు, నాయకులు కాచర్ల అంజి, బాలిరెడ్డి, మేడాపుం వెంకటేశ్ పాల్గొన్నారు.

● పుట్టపర్తి టౌన్ : పుట్టపర్తి నియోజకవర్గ సమన్వయ కర్త, మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో పుట్టపర్తిలో నిరసన ర్యాలీ చేపట్టారు. స్థానిక వైసీపీ కార్యాలయం నుంచి విద్యుత్ కార్యాలయం వరకు ఈ ర్యాలీ నిర్వహించి... ఎస్ఈ సురేంద్రబాబుకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్, వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

● కదిరి : విద్యుత్ చార్జీలు తగ్గించాలని వైసీపీ నాయకులు స్థానిక విద్యుత్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. మొదట వైసీపీ కార్యాలయం నుంచి విద్యుత్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు మగ్బుల్, పూల శ్రీనివాసరెడ్డి, వజ్రభాస్కర్‌రెడ్డి, ఇస్మాయిల్, లోకేశ్వర్ రెడ్డి, ప్రణీత్‌రెడ్డి పాల్గొన్నారు.

ఈవీఎం గోడౌన్ల తనిఖీ

ధర్మవరం, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): స్థానిక మార్కెట్‌యార్డ్‌లో ఉన్న ఈవీఎం యంత్రాలు, వీవీప్యాట్ భద్రపరిచే గోడౌన్‌ను కలెక్టర్ టీఎస్ చేతన్ శుక్రవారం తనిఖీ చేశారు. గోడౌన్‌కు వేసిన సీళ్లను ఈవీఎంల రక్షణ, భద్రతకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం పర్యవేక్షణ రిజిస్టర్‌లో కలెక్టర్ సంతకం చేశారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఎప్పటికప్పుడు ఈవీఎం, వీవీప్యాట్ గోదామును తనిఖీ చేసి సమగ్ర నివేదికను పంపిస్తున్నట్లు తెలిపారు. వివిధ రాజకీయ పార్టీల నాయకుల సమక్షంలో కలెక్టర్ ఈవీఎం, వీవీప్యాట్‌లను తనిఖీచేశారు. కలెక్టర్ వెంట ఆర్డీఓ మహేశ్, తహసీల్దార్ నటరాజ్ ఉన్నారు.

జగరాజుపల్లిలో వనమహోత్సవం

పుట్టపర్తిరూరల్ డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని జగరాజుపల్లి జడ్పీహెచ్ఎస్ స్కూల్, మోడల్ స్కూల్‌లో పచ్చదనం పరిశుభ్రత వనమహోత్సవ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఎస్వీయూ వ్యవసాయ కళాశాల ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్లు రమణమూర్తి, ఎంకే జోష్న మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి.. వాటిని సంరక్షించాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు మొక్కలు నాటారు. కార్యక్రమంలో మోడల్‌స్కూల్ ప్రిన్సిపల్ రమేష్‌బాబు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

జగన్ వల్లే విద్యుత్ చార్జీల పెంపు

కదిరి అర్బన్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): జగన్ పాలనలోనే విద్యుత్ చార్జీలు భారీగా పెరిగాయని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి వల్లెపు సోముశేఖర్ శుక్రవారం ఓ ప్రకటనలో విమర్శించారు. విద్యుత్ చార్జీలపై వైసీపీ చేస్తున్న ధర్నా సిగ్గుచేటన్నారు. రాష్ట్ర విద్యుత్ రంగంపై వేల కోట్లు భారం మోపిన జగన్... ఇప్పుడు చిలక పలుకులు పలుకుతున్నారు. 2022 నుంచి 24 వరకు రూ.17 వేల కోట్లు ట్రూఅప్ చార్జీలు పెంచారన్నారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడే చార్జీలు పెంచారని గుర్తు చేశారు. పదిసార్లు విద్యుత్ చార్జీలు పెంచిన వైసీపీకి ధర్నా చేసే నైతిక హక్కులేదన్నారు.

● బుక్కపట్నం : జగన్ అసమర్థత, అవినీతి వల్లే విద్యుత్ చార్జీలు పెరిగాయని, ఆయన డ్రామాలు ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని టీడీపీ మండల కన్వీనర్ చింతా మల్‌రెడ్డి, సీనియర్ నాయకులు గోపాలపురం గంగాధర్, జంగం వెంకటారాముడు, సతీష్‌రాయల్ పేర్కొన్నారు. శుక్రవారం వారు మాట్లాడుతూ... పార్టీ ఉనికి కోసం జగన్ సరికొత్త డ్రామాలు ఆడుతున్నారన్నారు. రూ.17వేలకోట్ల విద్యుత్ చార్జీల భారం పెంచింది జగనే అన్నారు. ఐదేళ్ల దరిద్రపు పాలనలో విచ్చలవిడిగా విద్యుత్ చార్జీలు పెంచారన్నారు. ఇప్పుడు నాయకులతో జగన్ ధర్నా చేయడం విడ్డూరంగా ఉందన్నారు. జగన్ డ్రామాలు ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు.

● ముదిగుబ్బ: రాష్ట్రంలో ఎన్డీఏ ప్రభుత్వం కరెంటు చార్జీలు పెంచిందని వైసీపీ నాయకులు ధర్నా, రాస్తారోకో చేయడం హాస్యాస్పదంగా ఉందని సీపీఐ మండల కార్యదర్శి చల్లాశ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో విమర్శించారు. జగన్ అధికారంలో ఉన్నపుడు ఐదేళ్లలో ఎనిమిది సార్లు కరెంటు చార్జీలు పెంచిన వైసీపీ నాయకులు... ఇప్పుడు మొసలి కన్నీరు కార్చడం విడ్డూరంగా ఉందన్నారు.



పరిశోధన పత్రాలతో విద్యార్థులు

కంప్యూటరైజేషన్‌పై జాతీయ సదస్సు

పుట్టపర్తిరూరల్ డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని బీడుపల్లి సంస్కృతి స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాలలో కంప్యూటరైజేషన్‌పై జాతీయ సదస్సును శుక్రవారం నిర్వహించారు. జేఎన్‌టీయూ మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ కళ్యాణిరాధ, చెన్నై వీఐటీ ప్రొఫెసర్ డాక్టర్ సుధీర్ కుమార్, ఐఐటీ హైదరాబాద్ పోస్టుడాక్టోరల్ పరిశోధకుడు డాక్టర్ సయ్యద్ తౌహీద్ ఇందులో మాట్లాడారు. ఇంజనీరింగ్‌లో సవాళ్లను ఎదుర్కోవడంలో గణితశాస్త్రానికే అధిక ప్రాముఖ్యత ఉందన్నారు. అనంతరం 150 మంది విద్యార్థులు తమ అత్యాధునిక పరిశోధనా పత్రాలను సమర్పించారు. కార్యక్రమంలో జేఎన్‌టీయూ మెకానికల్ ఇంజనీరింగ్ అసిస్టెంటు ప్రొఫెసర్ ఓ ప్రకాష్, కళాశాల డీన్ బాలకోటేశ్వరి, సిబ్బంది పాల్గొన్నారు.

క్రైం న్యూస్ ..

మహిళపై వీధికుక్కల దాడి


గాయపడిన సాలమ్మ

ధర్మవరం రూరల్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బడన్నపల్లిలో శుక్ర వారం సాయంత్రం వీధి కుక్కలు ఓ మహిళపై దాడి చేసి.. తీవ్రంగా గాయపర్చాయి. ఎజ్జే సాలమ్మ అనే మహిళ తన మనవడితో ఇంటి బయట ఉండగా వీధి కుక్కలు వేగంగా వచ్చి ఆమె కాలివేళ్లను కరిచి తీ వ్రంగా గాయపరిచాయి. దీంతో ఆమె కాలికి తీవ్ర గాయమైంది. కుటుంబసభ్యులు హుటా హుటినా ధర్మవరం ప్రభుత్వా సుపత్రికి తరలించారు. గతం లోనూ గ్రామంలో వీధి, పెంపుడు కుక్కలు పలుమార్లు మహిళలు , పిల్లలపై దాడులు చేశామని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి వీధికుక్కల బెడద నుంచి రక్షించాలని కోరారు.


బడన్నపల్లిలో సంచరిస్తున్న వీధికుక్కలు


బంగారు నగల దొంగ అరెస్టు

ఆరు తులాల ఆభరణాలు స్వాధీనం


వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ, సీఐ

ధర్మవరం, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): పట్టణంలో బంగారు బంగారు నగలు దొంగలించే దొంగను అరెస్టు చేశామని, అతని వద్ద నుంచి ఆరు తులాల బంగారు ఆబరణాలను స్వాధీనం చేసుకున్నామని డీఎస్పీ శ్రీనివాసులు, వన్‌టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు. నిందితుడ్ని స్థానిక కేతిరెడ్డికాలనీకి చెందిన సాకే నారాయణగా గుర్తిం చామన్నారు. శుక్రవారం సాయంత్రం వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో వారు తెలిపిన వివరాల మేరకు... నారాయణ అంజుమన్ సర్కిల్‌లో నడుచుకుంటూ వెళ్తున్న మహిళల మెడలో ఉన్న బంగారు ఆభర ణాలను అపహరించేవాడు. అదేవిధంగా లక్ష్మీచెన్నకేశవపురంలో ఓ ఇంటిలో తాళం పగలకొట్టి బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లాడు. వీటిపై కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేపట్టారు. శుక్రవారం లక్ష్మీచెన్నకేశవపురం సర్కిల్లో సాకే నారాయణ ఉన్నట్టు సమా చారం రావడంతో వన్‌టౌన్ సీఐ, సిబ్బంది శివకుమార్, భాస్కర్‌తో కలిసి వెళ్లి అతన్ని అరెస్టు చేశారు. అతని వద్ద ఉన్న రూ.4.25 లక్షల విలువ చేసే ఆరు తులాల ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం


గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

ధర్మవరం, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): స్థానిక దుర్గానగర్ బ్రిడ్జి వద్ద గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని శుక్రవారం స్వాధీనం చేసుకున్నట్లు టూటౌన్ సీఐ రెడ్డప్ప తెలిపారు. బ్రిడ్జి కింద వ్యక్తి మృతదేహం పడిఉం డటాన్ని గమనించిన స్థానికులు.. టూటౌన్ పోలీసులకు సమాచారం అందించారు. దీంతో సీఐ రెడ్డప్ప తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. తాగి కిందకు పడిపోవడంతో చనిపోయి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు 6305800429, 9704972324 నంబర్లకు సమాచారం ఇవ్వాలని సీఐ తెలిపారు.

మాజీ సీఎం జగన్‌కు స్వాగతం

బత్తలపల్లి/ముదిగుబ్బ: మాజీ సీఎం జగన్‌మోహన్ రెడ్డి పులివెందుల నుంచి శుక్రవారం ముదిగుబ్బ, బత్తలపల్లి మీదుగా బెంగళూరుకు వెళ్లారు. విషయం తెలుసుకున్న వైసీపీ నాయకులు, కార్యకర్తలు బత్తలపల్లి టోల్ గేట్ వద్దకు చేరుకొని ఆయనకు స్వాగతం పలికారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి, బయపురెడ్డి, జయరామిరెడ్డి ఉన్నారు.

క్లుప్తంగా..

మాజీ ప్రధాని మృతి దేశానికి తీరనిలోటు


మాట్లాడుతున్న మంత్రి సవిత

పెనుకొండ టౌన్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి) : మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతి దేశానికి తీరని లోటని బీసీ సంక్షేమ చేనేత జౌళిశాఖ మంత్రి సవిత అన్నారు. ఆయన మృతికి సంతాపం తెలిపారు. దేశ ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టిన సంస్కరణ రూపశిల్పిఅని కొనియాడారు. దేశం ఓ మంచి నాయకుడిని కోల్పోయిందని ఆయన ఆత్మకుశాంతి చేకూరాలన్నారు.

మన్మోహన్‌సింగ్ గొప్ప ఆర్థిక వేత్త

హిందూపురం, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి) : భారతదేశ మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతి దేశానికి తీరనిలోటని కాంగ్రెస్‌పార్టీ జిల్లా అధ్యక్షులు ఎంహెచ్ ఇనాయతుల్లా ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన తీసుకొచ్చిన సంస్కరణలు మరో పది కాలాలపాటు ఉంటాయన్నారు.

మన్మోహన్ మృతికి ఘన నివాళి

గుడిబండ, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మహాత్మా జ్యోతిరావుపూలే బాలికల కళాశాలలో ప్రిన్సిపల్ ప్రసాద్ ఆధ్వర్యంలో మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈకార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ మహాసభలపై ప్రచార జాతా

గోరంట్ల, డిసెంబరు27(ఆంధ్రజ్యోతి) : కాకినాడలో జరిగే యుటిఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలను విజయవంతంచేయాలని కార్యదర్శులు లక్ష్మీరాజ, కోటేశ్వరప్ప, పిలుపునిచ్చారు. మహాసభలను జనవరి 5నుంచి నాలుగురోజులపాటు కాకినాడలో నిర్వహిస్తుండడంతో రాష్ట్ర నాయకులు ప్రచార జాతా కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రచార వాహనం శుక్రవారం గోరంట్లకు రాగా, ఎమ్మార్సీ పాఠశాల వద్ద ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈకార్యక్రమంలో జిల్లా నాయకులు జయచంద్రారెడ్డి, సుధాకర్, బూతన్న, నరేష్‌కుమార్, మహాలింగప్ప తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న టీడీపీ సభ్యత్వ నమోదు

పెనుకొండ రూరల్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి):మండలంలోని కోనాపురంలో టీడీపీ సభ్యత్వ నమోదు శుక్రవారం జోరుగా కొనసాగింది. బీసీ సంక్షేమ చేనేతజౌళిశాఖ మంత్రి సవిత ఆదేశాలతో టీడీపీ నాయకులు ప్రసాద్, విజయ్ ఆధ్వర్యంలో గ్రామంలో టీడీపీ సభ్యత్వ నమోదు చేపట్టారు. టీడీపీ సభ్యత్వ నమోదు తీసుకున్నవారు ప్రమాదవశాత్తు మృతిచెందితే రూ.5లక్షల బీమా వర్తిస్తుందన్నారు.

30న విద్యార్థి యువజన సంఘాల పోరు

హిందూపురం అర్బన్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): ఈ నెల 30 రాష్ట్ర రాజధాని విజయవాడ నగరంలో విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో పోరు దీక్ష నిర్వహించ తలపెట్టినట్లు విద్యార్థి సంఘాల నాయకులు ఓ ప్రకటనలో పేర్కొన్నాడు. నారాలోకేష్ యువగళం పాదయాత్రలో ఇచ్చిన హామీలను నేరవేర్చాలని డిమాండ్ చేశారు. జీఓ నెంబర్ 77ను రద్దు చేయాలని, డిగ్రీ ఇంజనీరింగ్, పీజీ విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న ఫీజు రీ ఎంబార్స్‌మెంట్ వసతి దీవేన డబ్బులు విడుదల చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ నుంచి ఫీజులకు సంబంధించిన డబ్బు విద్యాసంస్థలకు రాలేదని దీంతో వారు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా వేధిస్తున్నారని తెలియజేశారు.

ఆర్టీఓ ఆఫీస్ ద్వారానే డీఎల్ జారీ చేయాలి

పెనుకొండ, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): ట్రాన్స్‌పోర్ట్ రంగంలోని కొన్ని సేవలను ప్రభుత్వం ప్రైవేట్ సంస్థలకు అప్పగించే ప్రయత్నాలను మానుకోవాలని సీఐటీయు నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం సీఐటీయు నాయకులు తహసీల్దార్‌ను కలిసి వనతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జనవరి నుండి డ్రైవింగ్ లైసెన్స్‌లు, ఫిట్నెస్ సర్టిఫికెట్లు జారీ ప్రభుత్వం ప్రైవేట్ వ్యక్తుల పరం చేయటానికి చేస్తున్న ప్రయత్నాలను ఆపి వేయాలన్నారు. ప్రజల భద్రతకు ప్రాణాలకు ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ట్రాన్స్‌ఫోర్ట్ రంగంలోని సేవలను ప్రైవేట్ వ్యక్తుల పరం చేస్తే వాహనదారులపై అదనపు పన్నుల భారం పడుతుందన్నారు. ఈ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

అవధూత దత్తాశ్రమానికి భూదానం

హిందూపురం అర్బన్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): అవదూత శ్రీ దత్త ఆశ్రయంకు పట్టణ పరిధిలోని రాజేశ్వరీ, విశ్వేశ్వర్య దంపతులు తన పేరున గల 17 సెంట్ల భూమిని, అదే విధంగా దత్తాత్రేయ భక్తుల బృందం వారి సహకారంతో మరో 10 సెంట్ల దానం చేశారు. దీని విలువ రూ.27 లక్షలు ఉందన్నారు. అదే విధంగా హిందూపురంలోని ఆర్.పి.జి.టి రోడ్డు అనఘదత్త ట్రస్ట్ దత్తదర్శిని ఆధ్వర్యంలో మార్గశిర మాసాన్ని పురస్కరించుకొని అనఘవ్రతం, రుద్రాభిషేకం, లలితా సహస్రనామ పారాయణ నిర్వహించారు.

ఘనంగా సంపత్ లక్ష్మీ వ్రతం

హిందూపురం అర్బన్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని ఎంఫ్‌రోడ్డులో నెలకిని ఉన్న శ్రీ లక్ష్మీ హయగ్రీవ దేవాలయంలో శుక్రవారం సాయంత్రం 7 గంటలకు సంతప్‌లక్ష్మీ వ్రతంను ఘనంగా నిర్వహించారు. పుసు కుంకుమలతో అభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో మూల విరాట్‌కు వివిధ అభిషేకాలు అర్చనలు నిర్వహించారు. వందలాది మంది మహిళలు వ్రతంలో పాల్గొన్ని భక్తిని చాటారు.

అప్పుడు పెంచి ఇప్పుడు ధర్నాలా ?

హిందూపురం, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): విద్యుత్ రంగంలో గత ఐదేళ్ల వైసీపీ పాలన చేసినపాపాలే ప్రస్తుతం ప్రజలకు శాపాలుగా మారాయని హిందూపురం నియోజకవర్గ టీడీపీ అధికార ప్రతినిధి పూలకుంట సర్పంచ్ మంజునాథ్ ఒక ప్రకటనలో మండిపడ్డారు. విద్యుత్‌చార్జీలు నిరసిస్తూ శుక్రవారం వైసీపీ నిరసన చేపట్టడం సిగ్గుచేటన్నారు. ఐదేళ్ల పాలనలో విద్యుత్ రంగాన్ని నాశనం చేసి ఇప్పుడు చార్జీలు పెరిగాయని ఆయనే ధర్నా చేయించడం విడ్డూరంగా ఉందన్నారు. దేశంలో ఇలాంటి రాజకీయ నాయకుడు మరెవెరూ ఉండరన్నారు.

గుండెపోటుతో చర్చి కమిటీ అధ్యక్షుడి మృతి


నివాళులు అర్పిస్తున్న శంకర్‌నారాయణ

పెనుకొండ, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి) : పెనుకొండ సీఅండ్ఐజి మిషన్‌చర్చి కమిటీ అధ్యక్షుడు స్టాండ్లీపాల్(65) గురువారం గుండెపోటుతో మృతిచెందారు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు సంతానం. స్టాండ్లీపాల్ మృతిచెందిన విషయం తెలిసిన వెంటనే శుక్రవారం వైసీపీ మాజీ మంత్రి శంకర్‌నారాయణ వైసీపీ నాయకులు, ప్రముఖులు మృతదేహాన్ని దర్శించి పూలమాలలువేసి నివాళులర్పించారు.

ఆధార్‌లో మార్పులకు ఆగని పరుగులు


ఆధార్ అప్‌డేషన్ కోసం క్యూలో మహిళలు (ఫైల్)

మడకశిర రూరల్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) ప్రస్తుతం ఆధార్ కార్డు లేకపోతే ఏ పనిజరగడం లేదు. ఏ చిన్న పని కావాలన్నా ఈ కార్డు ఉండాల్సిందే. స్కూల్‌విద్యార్థులు, ఉద్యోగస్థులు, రైతులు ఎవరైనా ప్రభుత్వ పథకాలు పొందాలంటే ఆధారే ఆధారం. ఇందులోని సమాచారం అంతా అప్‌డేట్‌గా ఉంటేనే వారికి అన్ని రకాల లబ్ధి చేకూరుతుంది. దీంతో చాలమంది ఆధార్ కార్డులను అప్‌డేట్ చేయించుకొంటున్నారు. దీంతో ఆధార్ సెంటర్ల వద్ద రద్దీ నెలకొంది.

ఆధార్ కార్డులేక ప్రభుత్వ పథకాలు అందడం లేదు


రామప్ప, మడకశిర

నేను కూలీ పనిచేసుకొని కుటుంబాన్ని పోషిస్తున్నాను. భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. నాకు ఓటరు ఐడి కార్డు ఉంది. గత ఆరుఏళ్లుగా ఆధార్ మాత్రం కార్డులేదు. దీంతో ప్రభుత్వ పథకాలు ఏవీ పొందలేకపోతున్నాను. నాకు మాత్రం బియ్యం రావడంలేదు. భార్య, కుమార్తెలు వివిధ ప్రమాదాల్లో మృతిచెందారు. వారి కోసం బ్యాంక్‌లో వేసిన డబ్బులను బ్యాంక్‌వారు ఇవ్వడంలేదు. హైదరాబాదుకు వెళ్ళలేక ఆధార్ కార్డులేక ఇంటి దగ్గరే నిరాశతో ఉంటున్నా.

మరికొంత మంది ఆధార్ సెంటర్లకు వెళ్ళినా అక్కడ ఆధార్ అప్‌డేట్ కాని వారు ఇబ్బందులు పడుతున్నారు.

ఆధార్ అప్‌డేట్ కోసం హైదరాబాద్‌కు ప్రయాణం

ఆంధ్రా, తెలంగాణా రాష్ట్రాలకు సంబంధించి భారత విశిష్టప్రాధికార గుర్తింపు సంస్థ (యూఐడీఏఐ) ఆధార్ ప్రాంతీయ కార్యాలయం హైదరాబాదులో ఉంది. ఆధార్ క్యాంప్‌లో వివిధ కారణాల వల్ల కార్డు అప్‌డేట్ కాని వారు అందరూ హైదరాబాదు కు ప్రయాణం కడుతున్నారు. మరికొంత మంది ఆర్థిక స్థోమత లేనివారు ఎక్కడ ఆధార్ క్యాంపులు పెడితే అక్కడికి వెళుతున్నారు. మండలంలోని డీ అచ్చంపల్లి గ్రామానికి చెందిన శివరాజ్ ఆధార్ కార్డు తీసుకుని పదేళ్ల అవుతోంది. మడకశిర ఆధార్ కేంద్రంలో అప్‌డేట్ చేస్తే అది తిరస్కరించింది. దీంతో అక్కడి అధికారులు హైదరాబాదులోని వెళ్ళి సరిచేయించుకోవాలని సూచించడంతో ఆయన హైదరాబాద్ వెళ్ళి కార్డులో మార్పు చేయించుకున్నారు. ఇలా ఎక్కడికీ వెళ్లలేనివారు ఆధార్ కార్డు లేక నిరాశతో ఇళ్లదగ్గర ఉండిపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు తగు చర్యలు తీసుకొని ఇలాంటి వారికోసం జిల్లా కేంద్రాల్లో ఆధార్ క్యాంపులు ఏర్పాటుచేయాలని ప్రజలు కోరుతున్నారు.

జగన్ పర్యటనలో బయటపడ్డ విభేదాలు

● అభిమానిని లాగిపడేసిన ప్రైవేట్ సెక్యూరిటీ సిబ్బంది

సోమందేపల్లి, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): సోమందేపల్లి మండల కేంద్రానికి ఆనుకుని ఉన్న జాతీయ రహదారిపై శుక్రవారం జగన్ పర్యటనలో భాగంగా పార్టీలో విభేదాలు బయటపడ్డాయి. జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ వర్గం ఉండగానే అక్కడికి చేరుకున్న శంకర్‌నారాయణ వర్గం నాయకులు ఆమెకు వ్యతిరేకంగా శంకర్‌నారాయణ నాయకత్వం వర్థిల్లాలంటూ నినాదాలు చేశారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న జనసందోహం మధ్య ఈ హఠాత్‌పరిణామం చోటుచేసుకుంది. దీంతో ఉషశ్రీ వర్గం నాయకులు సైతం అనుకూల నినాదాలను చేశారు. అప్పటికే అక్కడకు చేరుకున్న పోలీసులు పోటాపోటీ నినాదాలను చేస్తున్న వారి పరిస్థితిని పసిగట్టారు. దీంతో అప్రమత్తం అయ్యారు. అయితే అప్పటికే జగన్ కాన్వాయి అక్కడకు చేరుకోవడంతో వివాదం సద్దుమణిగింది. జైజగన్ అంటూ వారు కాన్వాయి వద్దకు పరుగులుతీశారు. ఈ నేపథ్యంలో జగన్ తన కారు నుంచి అభిమానులకు అభివాదం చేస్తున్న సమయంలో ఆయనతో సెల్ఫీ


అభిమానిని లాగిపడేస్తున్న సిబ్బంది

దిగేందుకు ప్రయత్నించిన అభిమానిని జగన్ ప్రైవేట్ సెక్యూరిటీ సిబ్బంది నిర్దాక్షిణ్యంగా పక్కకు లాగిపడేశారు. ఇదంతా చూస్తూ జగన్ వారిని నిలువరించకపోవడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. అభిమానిపై జగన్ తీరు పలు విమర్శలకు తావిస్తోంది. అనంతరం ఉషశ్రీని తన కారులో ఎక్కించుకుని ఆయన బెంగళూరుకు బయలుదేరి వెళ్లారు.

ఇచ్చిన మాట ఏమైంది : దీపిక

హిందూపురం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): అధికారంలోకి వస్తే కరెంటు చార్జీలు పెంచమని హామీ ఇచ్చి వచ్చాక ఆరు నెలలోపే ఇచ్చిన మాట తప్పారంటూ వైసీపీ పురం సమన్వయకర్త దీపిక అన్నారు. విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ శుక్రవారం నిరసన ర్యాలీ చేపట్టారు. అంబేద్కర్ సర్కిల్ నుంచి ట్రాన్స్‌కో ఈఈ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లారు. ఏఈ కృష్ణవేణికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా దీపిక మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలలకే రూ.6వేల కోట్లు బాదుడుకు మొదలు పెట్టారన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు వేణురెడ్డి, మునిసిపల్ వైస్ చైర్మన్ జబీవుల్లా, కౌన్సిలర్ షాజియా, మల్లికార్జున, నాయకులు మహేష్, మింటు, ప్రణయ్‌రెడ్డి, సీఎస్‌పీ నాగరాజు, చంద్ర, చిలమత్తూరు ఎంపీపీ పురుషోత్తంరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, చాంద్‌బాష, లేపాక్షి అంజినరెడ్డి, లోకేష్, తదితరులు పాల్గొన్నారు.

నరసింహస్వామి ఆలయ నిర్మాణానికి విరాళం

హిందూపురం అర్బన్, డిసెంబరు27, (ఆంధ్రజ్యోతి): పట్టణ నడిబొడ్డులోని గాంధీ సర్కిల్‌లో నూతనంగా నిర్మింప తలపెట్టిన శ్రీ లక్ష్మీ నరసింహ ఆలయానికి ముద్దిరెడ్డిపల్లికి చెందిన ప్రముఖ వ్యాపారి, శ్రీ చౌడేశ్వరీ ఆలయ ధర్మకర్త బండారు బాలాజీ, ఆయన కుమారుడు బండారు ప్రవీణ్‌లు రూ. 2,00,1116లను విరాళంగా అందించారు. ముద్దిరెడ్డిపల్లిలోని ఆయన స్వగృహంలో నరసింహ స్వామి ఆలయ కమిటీ సభ్యులకు సొమ్ము అందజేశారు. అయన మాట్లాడుతూ పవిత్ర యజ్ఞంకు తనవంతు సహాయ సహకారాలు అందజేశానన్నారు. కమిటీ సభ్యులు బండారు బాలాజీని ఆలయ శాశ్వత కమిటి సభ్యునిగా సభ్యత్వం నమోదు చేశారు. హిందూ ధర్మ పరిరక్షణకు ప్రోత్సాహం అందిందన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు రాఘవేంద్ర, నిమ్మకాయల రాము, మోతుకపల్లి చంద్ర తదితరులు ఉన్నారు.

పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలి: మాజీ మంత్రి ఉష

పెనుకొండ రూరల్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి) : పెంచిన ట్రూఅప్ చార్జీలు తగ్గించాలని వైసీపీజిల్లా అధ్యక్షురాలు ఉష డిమాండ్ చేశారు. విద్యుత్ చార్జీల బాదుడుపై వైసీపీ ఆధ్వర్యంలో శుక్రవారం విద్యుత్ చార్జీల పెంపుపై ర్యాలీ నిర్వహించారు. అనంతరం ట్రాన్స్‌కో కార్యాలయానికి చేరుకుని పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఏఈ నారాయణస్వామికి అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రవాల్మీకి చైర్మన్ పొగాకు రామచంద్ర, కౌన్సిలర్ సుధాకర్‌రెడ్డి, వైశాలి జయశంకర్‌రెడ్డి, నరసింహులు, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ర్యాలీ నిర్వహిస్తున్న జిల్లా అధ్యక్షురాలు ఉష

కార్యక్రమానికి దూరంగా మాజీ ఎమ్మెల్యే

మడకశిర టౌన్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): పెంచిన విద్యుత్ ఛార్జీలను వెంటనే తగ్గించాలని శుక్రవారం వైసీపీ నాయకులు విద్యుత్ శాఖ కార్యాలయం ముందు నిరసన కార్యక్రమం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే వై.టి.ప్రభాకర్‌రెడ్డి ఇంటి నుండి విద్యుత్ శాఖ ఏడీ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈకార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి దూరంగా ఉన్నారు. నియోజకవర్గం సమన్వయకర్త ఈరలక్కప్ప, మాజీ మంత్రి హెచ్.బి.నర్సేగౌడ్, మాజీ ఎమ్మెల్యే వై.టి.ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర వక్కలిగ సాధికార కన్వీనర్ జి.రంగేగౌడ్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రవిశేఖర్‌రెడ్డి, కార్యదర్శి వై.సి.గోవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మూలనపడ్డ చెత్తబండ్లు

వాడుకలోకి రాకుండానే తుప్పుపడుతున్న వాహనాలు

లేపాక్షి, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం అత్యుత్సాహంతో చెత్తను సేకరించడానికి చెత్తబండ్లు, రిక్షాలను కొనుగోలు చేసింది. అయితే అధికారంలో ఉన్నప్పుడు వాటిని వాడుకలోకి తీసుకురాకపోగా మూలానపడేశారు. దీంతో వాహనాలు మొత్తం తుప్పుపట్టాయి. లేపాక్షి మేజర్ పంచాయతీలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే తడిచెత్త, పొడిచెత్త వేరుచేసి ఏదో ఘనకార్యం సాధించాలని లక్షల రూపాయలు వెచ్చించి బ్యాటరీ వాహనం, పలు రిక్షాలను కొనుగోలు చేశారు. అయితే వాటి నిర్వహణ భారం అధికం అవ్వడంతో పంచాయతీ కార్యాలయం ప్రాంగణంలో ఓ మూలానపడేశారు. దీంతో అవి ఎండకు ఎండి వానకు తడిసి మూడేళ్లుగా తుప్పుపడుతున్నాయి. వీటిని ఉన్నతాధికారులు సైతం చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు. ప్రజాధనాన్ని ఇలా దుర్వినియోగం చేయడంపట్ల పంచాయతీ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వీటిని వాడకంలోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు.


పంచాయతీ కార్యాలయ ఆవరణలో చెత్త వాహనాలు

సచివాలయ భవన నిర్మాణాన్ని పూర్తిచేయాలి


హళ్లికెరలో అర్ధంతరంగా ఆగిన సచివాలయ భవన నిర్మాణం

అగళి, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి) : అగళి మండలంలోని 11గ్రామ పంచాయతీలలోని సచివాలయ భవనాలను పూర్తిచేయాలని ఆయా గ్రామ పంచాయతీల ప్రజా ప్రతినిధులు కోరుతున్నారు. అప్పటి ప్రభుత్వం గ్రామాలలో సచివాలయ భవన నిర్మాణాలు, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ క్లీనిక్‌లకు భవన నిర్మాణాలు చేపట్టినా, నేటికీ అసంపూర్తిగానే ఉన్నాయి. ఇరిగేపల్లి, ఆర్‌జిపల్లి, గ్రామ పంచాయతీ భవనాలు మాత్రమే పూర్తయ్యాయని మిగతా సచివాలయ భవన నిర్మాణాలు నిలిచిపోయాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి భవన నిర్మాణాలను పూర్తిచేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

లారీ డ్రైవర్ ఆత్మహత్యాయత్నం

గోరంట్ల, డిసెంబరు27 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని 4 వార్డుకు చెందిన వెంకటేష్ క్రిమిసంహారక మందు సేవించి శుక్రవారం ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. కొండప్ప కుమారుడైన వెంకటేష్ లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. ఈనెల 20న లారీలో బొగ్గు లోడు తీసుకెళ్తుండగా, మల్లాపల్లి సమీపంలో కారును ఢీకొని అనంతరం మల్లాపల్లి వద్ద బోల్తాపడిన విషయం తెలిసిందే. ప్రమాదంలో గాయాలపాలైన కారులో ప్రయాణిస్తున్న సిక్కిం రాష్ట్రానికి చెందిన రంజితగురాగ్ అనంతపురం ఆసుపత్రిలో 21న తేదీన చికిత్స పొందుతూ మృతిచెందారు. దీంతో లారీ డ్రైవర్‌పై కేసునమోదు చేసి పోలీసులు లారీని సీజ్ చేశారు. లారీని సీజ్ చేయడంతో లారీ యజమాని నుంచి వెంకటేష్‌పై తీవ్ర ఒత్తిడి వచ్చినట్లు బంధువులు తెలిపారు. దీంతో మనసిక ఒత్తిడికి గురై వెంకటేష్ విత్తన శుద్ధికి ఉపయోగించే అమోయిన్ పాస్పెట్ మాత్రలను అధిక మోతాదులో సేవించాడు. వెంటనే గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకురాగా, డాక్టర్ వినోద్‌కుమార్ చికిత్స చేసి, మెరుగైన చికిత్సకోసం ప్రయివేటు వాహనంలో హిందూపురం ఆసుపత్రికి తరలించారు.

నూతన ఎస్ఐను సన్మానించిన టీడీపీ నేతలు

రొళ్ల, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): రొళ్ల మండల పోలీస్‌స్టేషన్ కార్యాలయంలో మండల సీనియర్ టీడీపీ నాయకులు ఎస్ఐ వీరాంజనేయులను ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో మండల నాయకులు గురుమూర్తి, ఈరన్న, సిద్దగంగప్ప, హేమంత్, నాగేంద్ర, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల అర్జీదారులు ఆదాయ సర్టిఫికెట్ సమర్పించాలి

రొళ్ల మండలంలోని స్థానిక హౌసింగ్ కార్యాలయంలో ఇళ్ల కోసం అర్జీలు సమర్పించుకొన్న వారు కుల ఆదాయ సర్టిఫికెట్ సమర్పిస్తే అదనంగా రూ.50వేలు అందజేస్తుందని టీడీపీ నాయకులు తెలిపారు. ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

తెలంగాణ సీఎంతో పావగడ ఎమ్మెల్యే భేటీ

పావగడ, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): బెళగావిలోని గాంధీజీ శతమానోత్సవ కార్యక్రమంలో గురువారం సాయంత్రం పాల్గొన్న సందర్భంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పావగడ ఎమ్మెల్యే హెచ్.వి.వెంకటేష్ భేటీ అయ్యారు. కాంగ్రెస్ పార్టీలోనూ, పార్టీ అభివృద్ధిలోనూ పలు కీలక అంశాలపై చర్చించారు. గురువారం బెళగావిలో ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే ఆధ్వర్యంలో సీడబ్ల్యుసీ కాంగ్రెస్ మహాసభకు దేశంలోని కాంగ్రెస్ నేతలు అందరూ హాజరయ్యారు. ఈసందర్భంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పావగడ ఎమ్మెల్యే హెచ్.వి.వెంకటేష్ కలిసి తెలంగాణకు జరిగిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంలో నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలో అక్కడి కాంగ్రెస్ అభ్యర్థి చిక్కుడు వంశీకృష్ణ గెలుపు కోసం తాము ప్రచారం చేసి కృషి చేసినట్లు తెలిపారు.

మట్టి తవ్వుతున్న ఎక్స్‌కవేటర్ సీజ్

పరిగి, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): ఎటువంటి అనుమతులు లేకుండా మండల పరిధిలోని సేవామందిరం గ్రామంలో శుక్రవారం అక్రమంగా మట్టి తరలిస్తున్న ఎక్స్‌కవేటర్‌ను సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. వివరాల్లోకెళితే ఎఎంఆర్ పెనుకొండ, హిందూపురం, మడకశిర నియోజకవర్గ ఇన్‌చార్జి వంశీకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వానికి ఎలాంటి చలానాలు చెల్లించకుండా మండలంలో గత కొన్ని నెలల నుంచి అక్రమంగా మట్టి తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్న విషయం తెలుసుకుని ఎక్సాకవేటర్‌ను సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. ఇసుక తరలించడానికి అనుమతి తీసుకోకుండా అక్రమంగా తరలిస్తుండటంపై కేసు నమోదుచేసినట్లు తెలిపారు. ఎవరైనా సరే అనుమతి లేకుండా మట్టిని తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పెనుకొండ, హిందూపురం, మడకశిర నియోజకవర్గ ఇన్చార్జ్ వంశీకృష్ణ హెచ్చరించారు.



'రామ్‌రాజ్ కాటన్' షోరూం ప్రారంభం


షోరూం ప్రారంభోత్సవ దృశ్యం

హిందూపురం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి):సరికొత్త సంప్రదాయ వస్త్రరంగంలో ప్రసిద్ధి చెందిన 'రామ్‌రాజ్' సంస్థ హిందూపురంలోని రైల్వేస్టేషన్ రోడ్డులో షోరూం ఏర్పాటు చేసింది. గురువారం ఉదయం హిందూపురం మున్సిపల్ కమిషనర్ సంగం శ్రీనివాసులు ఈ షోరూంను లాంఛనంగా ప్రారంభించగా, డాక్టర్ ఎం.అమర్‌నాథ్‌రెడ్డి, డాక్టర్ వై.సంధ్యారాణి దీపప్రజ్వలన గావించారు. వీసీ జువెలర్స్ ప్రొప్రైటర్ ఎంకే అర్జున్, ఎంఏ సింధు మొదటి కొనుగోలును స్వీకరించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. తాము బాక్టీరియా, వైరల్ ఇన్‌ఫెక్షన్ల నుంచి కాపాడేందుకు కొత్తగా యాంటీ బాక్టీరియల్ ధోతీలను ఆవిష్కరించినట్లు వివరించారు. నిపుణులచే రూపొందించబడిన కాటన్‌తో తయారుచేయబడిన రామ్‌రాజ్ కాటన్ వస్త్రాలు దేశవ్యాప్తంగా అందుబాటులో వున్నట్లు పేర్కొన్నారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోండి

మడకశిర రూరల్, డిసెంబరు 27:(ఆంధ్రజ్యోతి) రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ కరుణాకర్ తెలిపారు. మండలంలో ఆర్ అనంతపురంగ్రామంలో శుక్రవారం రెవెన్యూ సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న గ్రామ సభలను గ్రామీణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సదస్సులో 10 అర్జీలు వచ్చినట్లు తెలిపారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించడమే లక్ష్యం

మడకశిరటౌన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడానికి రాష్ట్ర స్వర్ణోత్సవ మహాసభల్లో చర్చిస్తామని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు జయచంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎం.సుధాకర్‌లు అన్నారు. శుక్రవారం మడకశిర పట్టణంలో స్వర్ణోత్సవ మహాసభల్లో భాగంగా ప్రచార యాత్ర కార్యక్రమాన్ని అమరాపురం బస్టాండు ఆవరణంలో ప్రారంభించి మాట్లాడారు. జీఓ నెంబర్.117ను రద్దు చేయాలన్నారు.

బాధిత కుటుంబానికి నిత్యావసరాల పంపిణీ


నిత్యావసరాల కిట్లు పంపిణీ చేస్తున్న జపానందస్వామి

పావగడ, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): గడిచిన బుధవారం సాయంత్రం హరిహరపురం గ్రామంలో గ్యాస్‌సిలెండర్ పేలి గుడిసె దగ్ధమైన సంఘటనకు సంబంధించి బాధిత కుటుంబానికి రామకృష్ణ సేవాశ్రమ పీఠాధిపతి జపానందస్వామి నిత్యావసరాలను పంపిణి చేశారు. ఆయన శుక్రవారం ఆగ్రామానికి వెళ్లి కుటుంబ బాధితురాలైన భూతమ్మ కుటుంబానికి నెలకు సరిపడే ఆహార ధాన్యాలు, వస్త్రాలను శుక్రవారం అందజేశారు. గ్యాస్ సిలెండర్‌పేలి గుడిసె ఒక్కసారిగా దగ్ధం కావడంతో తాము ప్రాణాపాయం నుండి బయటపడ్డామని, ఇంటిలో ఉన్న సరుకులు, ధాన్యాలు పిల్లలు చదువుకొనే పాఠ్య పుస్తకాలు, వస్త్రాలు పూర్తిగా కాలిపోవడంతో నిరాశ్రయులయ్యామని వారు స్వామిజీకి మనవి చేసుకొన్నారు. ఇన్ఫోసిస్ సంస్థ ఆధ్వర్యంలో రామకృష్ణ సేవాశ్రమం ఇలాంటి బాధిత కుటుంబాలకు అండగా ఉంటుందని స్వామిజీ పేర్కొన్నారు.

వందరోజుల ప్రణాళికను తప్పక అమలు చేయాలి

అగళి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు వంద రోజుల ప్రణాళికను తప్పకుండా అమలు చేయాలని ఎంఈఓ-2 చంద్రశేఖర్‌నాయుడు పేర్కొన్నారు. అగళి మండలం ఇనగలూరు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులతో కలిసి ఆయన చర్చించారు. పదవ తరగతి పరీక్షలు త్వరలో జరుగనున్న నేపథ్యంలో విద్యార్థులకు 100రోజుల ప్రణాళిక ద్వారా ఉత్తీర్ణత సాధించేందుకు ఉపాధ్యాయులు కృషిచేయాలన్నారు. అనంతరం ఉపాధ్యాయులతో పలు విషయాలపై చర్చించారు. క్లాస్‌రూమ్‌లోకి వెళ్లి విద్యార్థులను పలు ప్రశ్నలు వేశారు. అదే విధంగా విద్యావిషయాలపై ఆరాతీశారు. ఇన్‌చార్జి హెచ్‌ఎం మల్లేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పావగడ, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): త్రైమాసిక కార్యనిర్వహణలో భాగంగా ఆదివారం పావగడ సబ్‌స్టేషన్ 66/11 కేవీ పరిధిలోని పావగడ, వెంకటాపురం, శైలాపురం, నాగలమడక, మంగళవాడ, వై.ఎన్.హొసకోట సబ్‌స్టేషన్‌లలో ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఏర్పడనుందని, ప్రజలు సహకరించాలని పావగడ ఏఈఈ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కృష్ణమూర్తి తెలియజేశారు.

ఘనంగా అయ్యప్పస్వామి మండల పూజ


అగ్నిగుండ మహోత్సవంలో అయ్యప్ప భక్తులు

అమరాపురం, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): అమరాపురం మండల కేంద్రంలో అయ్యప్పస్వామి మండల పూజను ఘనంగా నిర్వహించినట్లు గురుస్వామి రామాంజనేయులు తెలిపారు. అయ్యప్పస్వామి చిత్రపటాన్ని ట్రాక్టర్‌లో ఉంచి పురవీధులమీదుగా ఊరేగించారు. అయ్యప్పస్వామి మాలధారులు వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం ఘనంగా మండల పూజ నిర్వహించారు. అయ్యప్పస్వాములు ఉదయం నుండి ఉపవాసం ఉండి రాత్రి 6 గంటల సమయంలో అగ్నిగుండ ప్రవేశం చేశారు. అధిక సంఖ్యలో భక్తులు మండల పూజలో పాల్గొన్నారు. వచ్చిన భక్తులకు అన్నదానం చేసి తీర్థప్రసాదాలను పంచిపెట్టారు.